
BALA CHELIMI

BALA




MAY | MAY 2025

₹40

జూన్ - 2025

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 34 • సంచిక : 9

JUNE - 2025



Gurukul CET :
Common Entrance Test
for Integrated Gurukul Schools
From 2025

Editor : Er. VEDAKUMAR MANIKONDA

A PUBLICATION OF CHILDREN'S EDUCATIONAL ACADEMY, HYDERABAD, TELANGANA

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ. 330 • తగ్గింపు ధర రూ. 300

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ. 350 • తగ్గింపు ధర రూ. 300



ప్రతులకు

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com* *website : www.balachelimi.com*




## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక


సంపుటి: Volume: **34** | సంచిక : Issue : **9** | హైదరాబాద్ Hyderabad | జూన్ June | పేజీలు Pages **52** | రూ. ₹. **40**












**లోపలి పేజీల్లో.......**




| శీర్షిక | రచయిత | పేజీ |
|---|---|---|
| ఉపాధ్యాయులు పిల్లల హృదయ నిర్మాతలు....... | మణికొండ వేదకుమార్. | 5 |
| వైద్యశాస్త్రంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన జీవశాస్త్రవేత్త లూయీ పాశ్చర్ (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| రెండు చక్రాల రథం (సైకిల్ దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| అవనీ చతుర్వేది | షిరోన్-256 | 9 |
| గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం (అక్షరం) | డా॥ జనపాల శంకరయ్య | 10 |
| చివరి పరీక్ష (కథ) | బెల్లంకొండ నాగేశ్వరరావు | 11 |
| చీమ - మిడత (చిన్న కథ) | అవర్ ఫాదర్స్ హౌస్ సూప్ కిచెన్ | 12 |
| వాన (పాట).. | గంగదేవు యాదయ్య | 12 |
| జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం | బాలచెలిమి డెస్క్ | 13 |
| కాలం లెక్కలు - 4 (కాలం) | గోపాలం కె బి | 14 |
| బంగారు మల్లె - 1 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| ఏనుగు (కథ) | లియో టాల్‌స్టాయ్ | 17 |
| మూడు కాళ్ళ పరుగు (ఆట) | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు | 18 |
| ముడుమాల నిలువు రాళ్ళు - ఆదిమానవుల చరిత్రకు మైలురాళ్ళు (యాత్ర) | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి | 19 |
| తెలుగు వాళ్ళకు కారాలంటే ఎంతో ఇష్టం... | మడపతి రాజు | 20 |
| త్యాగ భావానికి ప్రతీక బక్రీద్ (పండుగ) | డా. అమ్మిన శ్రీనివాసరాజు | 21 |
| అల్లనేరేడు చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 23 |
| స్ఫూర్తివంతమైన మైఖేల్ ఫారడే జీవితం (సైన్స్ వెన్నెల-8) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| విలువల బడి - సృజనకు గుడి | భూపతి వెంకటేశ్వర్లు | 25 |
| కార్టూన్ | వడ్డేపల్లి వెంకటేశ్ | 26 |
| అర్జున్ ఎరిగైసి - ఈస్పోర్ట్స్ వరల్డ్ కప్‌కి అర్హత పొందిన తొలి భారతీయ చెస్ గ్రాండ్‌మాస్టర్ (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 27 |
| ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ కప్ విజేతగా కనక్ | బాలచెలిమి డెస్క్ | 27 |
| వరుస 10 సంఖ్యల మొత్తం (మాథ్స్ ట్రిక్స్) | అంకెల మామయ్య చంద్రయ్య | 28 |
| కప్ప చెప్పింది... తప్పు తెలిసింది!" (కథ) | కె.వి.లక్ష్మణ రావు | 29 |
| మోసపోయిన బ్రాహ్మణుడి కథ | పంచతంత్ర కథ | 30 |

| | | |
|---|---|---|
| గుర్రపు స్వారీ (కథ) | అనిల్ బత్తుల | 31 |
| వేమన పద్యాలు | | 32 |
| రాక్షస గూళ్ల యుగం (చరిత్ర పాఠాలు-4) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 33 |
| పిసినారి (కథ) | ఐతా చంద్రయ్య | 35 |
| ప్రపంచ పర్యావరణ దినోత్సవం - 2025 | జి. సత్యనారాయణ | 36 |
| అంతర్జాతీయ మ్యూజియం డే (మే 23, 2025) | బాలచెలిమి డెస్క్ | 37 |
| చెలిమి క్లబ్ | బాలచెలిమి | 38 |
| నవ్వుల నదిలో సాగు (కవిత) | గద్వాల సోమన్న | 38 |
| జ్యేష్ఠ మాసం (నెలలు) | బాల కథా సౌరభం | 39 |
| పెరాక్సైడ్ రాకెట్ (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 40 |
| జింక ప్రాణం (కథ) | వడ్డేపల్లి వెంకటేశ్ | 41 |
| నేర్చుకుందామా | | 42 |
| కలం-చెలిమి | | 42 |
| భారతదేశంలోని టాప్ 10 ప్రధాన ఆనకట్టల జాబితా (జి.కె.) | బాలచెలిమి డెస్క్ | 43 |
| జింక (జంతువు) | సచిన్ కోత్వాల్ | 44 |
| పందెం కాసిన చెట్లు (కథ) | భూక్యా కవిత | 45 |
| పుస్తక పరిచయం | | 46 |
| విద్యార్థులలో పుస్తక పఠనం పెంపొందిస్తున్న బాలచెలిమి గ్రంథాలయం.. | సి. కిరణ్ కుమార్ | 47 |
| సమాచారం | బాలచెలిమి డెస్క్ | 48 |
| భాగ్యరెడ్డి వర్మ (వ్యక్తిత్వం) | డా. సంగిశెట్టి శ్రీనివాస్ | 50 |


## చెలిమి లేఖలు

బాలచెలిమి పత్రిక పిల్లలలో బుద్ధి వికాసం, ఆచారాలు, సాంస్కృతిక విలువలు పెంపొందించేలా రూపొందించబడింది. పత్రికలో ఉన్న చిన్న కథలు నైతిక బోధతో కూడినవిగా ఉండి పిల్లలలో ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయి. సరళమైన భాషలో చిన్న చిన్న శాస్త్రీయ అంశాలను పరిచయం చేయడం ఈ పత్రిక ప్రత్యేకత.

**- యం. వేణు,** సిద్దిపేట.

పిల్లల మనోభావాలు, ఆటలు, సైన్స్ మరియు జి. కె. లాంటి ఎన్నో వినూత్నమైన కథలు బాలచెలిమి మాస పత్రికలో ప్రచురిస్తూ, పిల్లలలో ఆలోచన శక్తి, సృజనాత్మకతను వెలికితీసి ప్రక్రియలో బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ సార్ గారు చేస్తున్న కృషికి నా యొక్క ధన్యవాదాలు. ఇలాంటి పత్రికల ద్వారా పిల్లలలో మనోవికాసం, జ్ఞాన సంపాదను నేర్చుకుంటూ అత్యున్నత శిఖరాలను అధిరోహించేలా, మరెన్నో ఆసక్తి కలిగిన విషయాలను బాలచెలిమి పత్రిక ద్వారా అందించాలని సంపాదక వర్గానికి నా మనవి.

**- కేదార్,** బాలచెలిమి పాఠకులు, హైదరాబాద్.

బాలచెలిమి అనేది పిల్లల మానసిక వికాసం, భాషా నైపుణ్యం, మరియు నైతిక విలువల పెంపులో సహాయపడే గొప్ప తెలుగు పిల్లల మాసపత్రిక. ప్రతి ఇంట్లో పిల్లలకు ఈ పత్రిక తప్పకుండా అందుబాటులో ఉండాలి. రంగురంగుల పేజీలు, నైసర్గిక చిత్రణలు పిల్లల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

**- కె. శివ,** వేములవాడ

*Cover Picture*
***Gurukul CET : Common Entrance Test for Integrated Gurukul Schools From 2025***



*బొమ్మలు:*
**కూరెళ్ల శ్రీనివాస్**
m : 98495 43728


**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713


# ఉపాధ్యాయులు పిల్లల హృదయ నిర్మాతలు

పిల్లలూ...

సరదగా గడిపిన సెలవులు ముగిసి పాఠశాలలు మళ్లీ ప్రారంభం కాబోతున్నాయి. ఈసారి ఋతుపవనాలు తొందరగానే వస్తున్నాయి. ఎండలు తగ్గి చినుకులు పడుతున్నాయి. ప్రకృతి చల్లదనంతోనూ, పచ్చదనంతోనూ తొణికిసలాడుతుంది. ఈ ఆహ్లాద సమయంలో మళ్లీ మీ చదువు మొదలు పెట్టబోతున్నారు.

బడి అంటే నాలుగక్షరాలు నేర్పించే శిక్షణాలయం కాదు. రేపటి పౌరుల్ని చెక్కే శిల్పశాల కాదు. బడి అంటే రంగు రంగుల పూలతోట. మీరంతా ఆ పూలతోటలో హాయిగా, స్వేచ్ఛగా షికారు చేస్తున్న సీతాకోక చిలుకలు. ఈ తోటకు తోటమాలి ఉపాధ్యాయుడు. మీరు మీ ఇంటిలో మీ అమ్మా నాన్నలతో, కుటుంబ సభ్యులతో గడిపే సమయం కన్నా బడిలో తోటి పిల్లలతో, ఉపాధ్యాయులతో గడిపే సమయం ఎక్కువ. ఉపాధ్యాయులు కూడా మీతోనే ఎక్కువ సమయం గడుపుతారు. తమ పిల్లల పట్ల చూపే వాత్సల్యం మీ మీద చూపుతారు. ఉపాధ్యాయులంటే బెత్తంతో దండన చేసే శిక్షకులు కాదు. పిల్లల పట్ల బాధ్యతతో అంకితమైన పిల్లల ప్రేమికులు. మీకూ ఊహలున్నాయని, వాటికి రెక్కలున్నాయని తెలుసు కనుక మీరు ఎగరడానికి, ఎదగడానికి తోడ్పడతారు. మీ ఆలోచనలూ, అభిప్రాయాలూ, సందేహాలూ నిర్భయంగా, నిజాయితీగా చెప్పగలిగే స్వేచ్ఛనూ, చొరవనూ ఇస్తారు. మీ ఊహాజనిత స్వభావాన్ని, వ్యక్తీకరణ నైపుణ్యాలను ప్రోత్సహిస్తారు. మీచేత కథలూ, కవితలూ రాయిస్తారు. బొమ్మలు వేయడం, నాటికలు, నాటకాలు వేయడం, ఆటలూ, పాటలూ నేర్పిస్తారు. కళల పట్ల ఆసక్తి పెంచుతారు. మీలోని అభిరుచులకు మెరుగులు దిద్దుతారు. మీ సామర్థ్యాల మీద మీకు నమ్మకాన్ని కలిగిస్తారు. అధ్యయనం, అభ్యాసం అలవాటు చేస్తారు. మీరు అడిగే అన్ని ప్రశ్నలకీ ఓపికతో సమాధానాలు చెబుతారు. పాఠ్యాంశాలతో పాటు పాఠ్యేతర అంశాలపై మీకు జిజ్ఞాసను కలిగించి మీ వ్యక్తిత్వానికి రూపురేఖలు దిద్దుతారు. మీ మనో వికాసాభివృద్ధికి బాటలు వేస్తారు. జ్ఞాన అన్వేషణ వైపు మిమ్మల్ని నడిపిస్తారు. మీ ప్రవర్తనా తీరుపై అవగాహన ఇస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఉపాధ్యాయులు పిల్లల హృదయ నిర్మాతలు. పిల్లలూ, ఉపాధ్యాయులూ కలిస్తేనే బడి.

పిల్లలూ... క్లాసులు బిగినవ్వుతున్నాయి కదా. ఇక చదువుపై ధ్యాస పెట్టండి. కొత్త స్నేహాలకు స్వాగతం చెప్పండి. మీ సెలవుల అనుభవాల్నీ, అనుభూతుల్నీ మీకిష్టమైన పద్ధతిలో రాసి బాల చెలిమికి పంపండి.




మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి





సైంటిస్ట్

## వైద్య శాస్త్రంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన జీవశాస్త్రవేత్త

# లూయీ పాశ్చర్

వ్యాధులకు సూక్ష్మజీవులు కారణమని కనుగొని రోగ నివారణకు అనేక పరిశోధనలు చేసి టీకాను తయారు చేసిన ఫ్రెంచ్ జీవశాస్త్రవేత్త లూయీ పాశ్చర్. టీకాలకు ఆద్యుడు. మొదటిసారి రేబిస్ వ్యాధికి టీకాను తయారు చేసాడు. పాల ద్వారా సంక్రమించే వ్యాధులను అరికట్టే విధానాన్ని కనుగొన్న శాస్త్రవేత్తగా లూయీ పాశ్చర్ సుపరిచితులు.

లూయీ పాశ్చర్ 1822 డిసెంబర్ 27న ఫ్రాన్స్‌లోని డోలెలో జన్మించారు. తండ్రి జోసెఫ్ పాశ్చర్. తల్లి ఎటెన్నట్ కోర్వి. 1854లో మేరీ లారెంట్‌ను పెళ్లి చేసుకున్నాడు. ఇతనికి చిత్రలేఖనమంటే చాలా ఇష్టం. చేపలు పట్టడం పట్ల చాలా ఆసక్తి. బెసాన్‌కాన్ యూనివర్సిటీ నుండి ఆర్ట్స్ మరియు ఫిలాసఫీలో బ్యాచిలర్ డిగ్రీని తీసుకున్నాడు. ఎకోల్ నార్మల్ సుపీరియార్ నుండి రసాయన శాస్త్రంలో పి.హెచ్‌డి సాధించాడు. విల్లే విశ్వవిద్యాలయంలో సైన్సెస్ ఫ్యాకల్టీ డీన్‌గా పని చేశాడు.

వ్యాధులకి సూక్ష్మక్రిములే కారణమని నిరూపించి జెర్మ్ సిద్ధాంతాన్ని ఆవిష్కరించాడు. ఇది ఆధునిక వైద్య శాస్త్రానికి బాటలు వేసింది. జెర్మ్‌థియరీని, వైరస్ బలాన్ని తగ్గించే విధానాలను అభివృద్ధి చేసాడు. స్మాల్‌ఫాక్స్, టి.బి., చికెన్ కలరా, ఆంత్రాక్స్ కోసం టీకాను వివిధ ప్రయోగాల ద్వారా అభివృద్ధి చేసాడు. కుక్క కాటుకు గురైన 9 సంవత్సరాల జోసెఫ్ అనే బాలుడికి మొదటిసారిగా టీకాను యిచ్చాడు. బాలుడు కోలుకోవడంతో టీకా ఇంపాక్ట్ ప్రపంచానికి తెలిసింది. పాశ్చర్ పారిస్‌లో పాశ్చర్ ఇనిస్టిట్యూట్ ప్రారంభించాడు. వివిధ స్థాయిల ఉష్ణోగ్రతలను ఉపయోగించుకుని పాలు, ఇతర ఆహార పదార్థాలను ఎక్కువ కాలం నిల్వ చేసే విధానం పాశ్చరైజేషన్‌ను ఆవిష్కరించాడు. ఈస్ట్, లాక్టోబాసిల్లస్ వంటి క్రిముల ద్వారా మద్యం, పెరుగు వంటివి తయారవుతాయని కిణ్వన ప్రక్రియ ద్వారా నిరూపించారు. స్వాన్‌నెక్ ఫ్లాస్క్ అనే ప్రత్యేక ఫ్లాస్క్ ప్రయోగం ద్వారా జీవులు స్వయంగా ఉద్భవిస్తాయనే సిద్ధాంతాన్ని తప్పుగా నిరూపించాడు. పాశ్చర్ సూక్ష్మ పరిశీలనావాది. ఈ పరిశీలనా నైపుణ్యం తన అన్ని పరిశోధనలలోను చోదకశక్తిగా నిలిచింది.

తన కుటుంబ సభ్యులను కోల్పోయినా, తాను పక్షవాతానికి గురయినా, ఎన్నో ఆటంకాలను అధిగమించి ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పరిశోధనలు సాగించాడు. సమిష్టి కృషి పట్ల విశ్వాసం ఎక్కువ. ఇతరులతో కలిసి ఎన్నో ఆవిష్కరణలు చేసాడు.

ఆధునిక వైద్య శాస్త్రానికి పితామహుడు. సూక్ష్మ జీవశాస్త్రంలో అగ్రగణ్యుడు లూయీపాశ్చర్ 1895 సెప్టెంబర్ 28న మరణించాడు.

– జుగాష్‌విలి

బాలచెలిమి డెస్క్, m : 9848266384

# రెండు చక్రాల రథం




రెండు చక్రాల రథమా! నేను ఎప్పుడూ వినలేదే అంటారా. పిల్లలూ చిన్నప్పుడు మీరు కొనుక్కున్న మొదటి వాహనం ఏమిటో చెప్పగలరా. అది లైసెన్స్ కూడా లేకుండా నడపగలిగే వాహనం. మాకు అర్థమైంది... సైకిల్. నా చిన్నప్పుడు నేను సొంతంగా తొక్కింది మూడు చక్రాల సైకిల్. అవును. మీ మొదటి వాహనం సైకిల్ గురించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుందాము.

“The bicycle is the noblest invention of mankind”.

ఏ వస్తువునైనా కనుక్కోవడానికి పరిస్థితుల ప్రభావం చాలా ఉంటుంది. అలాగే మనం ఇప్పుడు చూస్తున్న రెండు చక్రాల సైకిల్ వెనుక కూడా చిన్న కథ ఉంది. ‘Necessity is the mother of invention’, అన్నట్లు సమస్య నుండే పుట్టుకొచ్చింది తొలి సైకిల్.

సైకిల్ ఆవిష్కరణ గురించి తెలుసుకోవడానికి మనం టైం మిషన్‌లో కొంత వెనక్కు వెళ్లాలి. అది 1816వ సంవత్సరం. దానికి ముందు సంవత్సరం ఇండోనేషియా లోని ‘మౌంట్ టంబోరా’ అగ్నిపర్వతం పేలింది. ఆ అగ్ని పర్వతం నుండి వచ్చిన లావా కొన్ని వేల కిలోమీటర్ల మేర ధూళి మేఘం లాగా వ్యాపించింది. సూర్యకిరణాలు కూడా భూమిని చేరలేకపోయాయి. దాని ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. సగటు ఉష్ణోగ్రత 0.4-0.7 డిగ్రీ సెల్సియస్‌కి పడిపోయింది. ఫలితంగా కరువు మరియు వ్యాధులు. ఎక్కడా పంటలు పండలేదు. ఆ సమయంలో జర్మనీలోని ‘బేరన్ కార్ల్ వాన్ డ్రెయిస్’ యాంత్రిక శాస్త్రం మీద అభిరుచితో రకరకాల యంత్రాలను తయారు చేస్తుండేవాడు. ఆ రోజుల్లో రవాణాకి ఉపయోగించే జంతువులకు కూడా కరువు వచ్చింది. అప్పుడు తొందరగా ప్రయాణించడానికి వీలుగా సైకిల్ ‘వాన్ డ్రెయిస్’ చేతిలో ప్రాణం పోసుకుంది. రెండు చక్రాలు, హేండెల్‌తో, పెడెల్, చైన్ లేకుండా మధ్యలో కూర్చుని కాళ్లతో తోసుకొని వెళ్లేలా 1817లో రూపొందించాడు. వాన్ డ్రెయిస్ రూపొందించిన తొలి సైకిల్ ఉత్పత్తి జర్మనీ, ఫ్రాన్స్‌లో మొదలైంది. 1860లో పెడల్స్ తో సైకిల్ ని ఫ్రెంచ్ ఇంజనీర్ ‘పియేర్ మిషాక్స్’ రూపొందించాడు. 1885లో ‘జాన్ కెంప్ స్టార్ల్’ చైన్ తో కూడిన సైకిల్‌ని రూపొందించాడు. 1890లో ‘జాన్ బాయిడ్ డన్ లప్’ గాలితో నింపే టైర్లను దీనికి జోడించాడు. అదే ఇప్పుడు వాడుతున్న రెండు చక్రాల రథం.

ఈ సైకిల్ వాడకంలో ఉన్న సౌలభ్యాల వల్ల సామాన్యుని రథంలాగా అందరికి చేరువయింది. సైకిల్‌కి డీజిల్, పెట్రోల్ లాంటివి అవసరం లేదు. కాలుష్యరహితం. ఎంతటి ఇరుకు సందుల్లో అయినా ప్రయాణించగలదు. అందుకే కోడి కూత కన్నా ముందే మనం ట్రింగ్ ట్రింగ్ అంటూ సైకిల్ బెల్ వినిపిస్తుంది. పేపర్ బాయ్, పాల బాబాయ్, కూరల తాత, ఇడ్లీలు అమ్మే మామ, అందరూ తమ వ్యాపారాలకు సైకిల్‌నే వాడుతారు.

సైకిల్ ప్రయోజనాలను గుర్తించిన వైద్యులు కూడా దీని పై ప్రయాణాన్ని ప్రోత్సహిస్తున్నారు. అన్ని భాగాలకు ఆక్సిజన్, పోషకాలను మరింత సమర్థవంతంగా అందిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. కొవ్వు వేగంగా కరుగుతుంది కనుక అధిక బరువుకి సైక్లింగ్ ఎంతో మేలు. కాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. సైక్లింగ్ ఎండార్ఫిన్ లను

విడుదలచేస్తుంది. ఇది మానసిక స్థితిని మెరుగుపరచడం లోను, ఒత్తిడిని తగ్గించడంలోను ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తుంది. వెరికోస్ వెయిన్స్ సమస్యలతో బాధ పడేవారికి సైక్లింగ్ చక్కటి వ్యాయామం. ఇన్ని ప్రయోజనాలున్న సైక్లింగ్ గురించి అవగాహన పెంచడానికి సైకిల్ దినోత్సవాన్ని జరుపుకోవాలని పోలిష్-అమెరికన్ సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ 'లెస్జెక్ సిబిల్స్కి' ప్రతిపాదించారు. దీనికి తుర్క్ మెనిస్తాన్ తో సహా అనేక దేశాల మద్దతు లభించింది. దీంతో ఏప్రిల్ 2018లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రతి సంవత్సరం జూన్ 3న సైకిల్ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రతిపాదించింది. అంతర్జాతీయ సైకిల్ దినోత్సవంలో స్వచ్ఛంద సంస్థలు, కొన్ని వ్యాపార సంస్థలు, బైక్ రైడర్స్ గ్రూప్‌లు పాల్గొంటాయి. దీనికి కూడా ప్రతి సంవత్సరం ఒక్కో థీమ్ ఉంటుంది. 2025 సంవత్సరానికి థీమ్ మెరుగైన ఆరోగ్యానికి, కాలుష్య నివారణకు సైక్లింగ్ (promoting health, equity and sustainability through cycling).

కాలుష్యరహిత పరిసరాల కోసం ప్రతి దేశంలోను సైక్లింగ్ కోసం ప్రత్యేక ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి ఎన్నో దేశాలు పోటీలను కూడా నిర్వహిస్తున్నాయి.

ప్రస్తుతం బైక్‌ల కన్నా ఖరీదైన సైకిళ్లు తయారు చేస్తున్నారు. మహేష్ బాబు శ్రీమంతుడు సైకిల్ మీ అందరికీ గుర్తు ఉండే ఉంటుంది. ఆధునిక టెక్నాలజీతో సైకిళ్లకు గేర్‌లు, ఎల్ సీ డీ తెరలు, మడతపెట్ట గలిగే సైకిళ్లు కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి. వినోదం, ఆరోగ్యం కలగలిసిన ప్రయాణానికి సైకిల్‌ని మించినది లేదు. పిల్లలూ మీరు కూడా దగ్గరలో ఉన్న దుకాణాలకు, స్నేహితుల ఇళ్లకు వెళ్లడానికి సైకిల్ వాడండి. కాలుష్యనివారణకు, ఇంధనాన్ని ఆదా చేయడానికి మీ వంతు కృషి చేయండి.

"Biking can be the answer to both happiness and health".

– డా. నీరజ అమరవాది
m : 9849160055

## బొమ్మలేద్దామా...



బి. చాహ్నాకృష్ణ
వయస్సు: 11సంవత్సరాలు, 7వ తరగతి, జెనీవా

చందదారులుగా చేరండి! బాల చెలిమి చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

# అవనీ చతుర్వేది


## ఫైటర్ జెట్ను ఒంటరిగా నడిపిన మొదటి భారత మహిళ

అవనీ చతుర్వేది (1993 అక్టోబర్ 27 - ) మధ్యప్రదేశ్‌లోని రేవాకు చెందిన భారత పైలట్. సహోద్యోగులు మోహనా సింగ్, భావనా కాంత్‌లతో పాటు భారత వైమానిక దళ ఫైటర్ పైలట్ విభాగంలో చేరి ఆమె చరిత్ర సృష్టించారు. ఐఏఎఫ్ ఫైటర్ విభాగంలో చేరే కంటే ముందు హైదరాబాద్లోని దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ఆరు నెలల పాటు కఠినమైన శిక్షణను అవని తీసుకున్నారు.

2014లో రాజస్థాన్‌లోని బనస్థలి కళాశాలలో ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేశారు. ఫిబ్రవరి 2018లో మిగ్-21 బైసన్ అనే యుద్ధ విమానాన్ని ఒంటరిగా నడిపిన మొదటి భారత మహిళగా అవని పేరు తెచ్చుకున్నారు. జామ్‌నగర్‌లోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ బేస్ నుంచి ఈ మిషన్‌లో ఆమె పాల్గొన్నారు.

ఆమె సాధించిన విజయాలను భారత దేశం అంతటా వేడుకగా నిర్వహించారు. సాయుధ దళాలలో లింగ సమానత్వానికి ఆమె విజయాన్ని ఒక ముఖ్యమైన అడుగుగా భావించారు. 2020లో ఆమె నారీ శక్తి పురస్కారం అందుకున్నారు.

– 'షీరోస్-256
ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా'
నుండి....




### మీకు తెలుసా?


2023లో జపాన్‌లో జరిగిన ఎయిర్ వార్ గేమ్‌లో పాల్గొని విదేశాలలో ఈ ఘనత సాధించిన భారత వాయు సేన మొదటి మహిళా ఫైటర్ పైలట్‌గా అవని పేరు



# 1991 - ఆంధ్రప్రదేశ్ విద్యాపథకంలో - భాగంగా గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం- గుర్తించే అక్షరాన్ని ఎర్రని సిరాతో రాయడం




అందరి ముందర నేనుంటా!
అమ్మకు ముందర నేనుంటా!
అచ్చుల ముందర నేనుంటా!
అయితే నేనెవరంటా? " అ " అక్షరం



ఆకలి ముందర నేనున్నా!
ఆకుల ముందర నేనున్నా!
ఆవుకు ముందర నేనున్నా!
అది నేనెవరో చెప్పండి? " ఆ " అక్షరం




ఇంటికి ఇటుకకు ముందుంటా!
ఇంతి ఇలలో ముందుంటా!
ఇద్దరిలో నేను ముందున్నా!
ఇక నేనెవరో చెప్పండి? " ఇ " అక్షరం



ఈలకు ఈకల ముందన్నా!
ఈతలో నేనే ముందుంటా!
ఈతకాయలో ముందుంటా!
ఇక నేనెవరో తెలుపండి? "ఈ" అక్షరం

- డా॥ జనపాల శంకరయ్య
m : 8074727108

# చివరి పరీక్ష



భువనగిరిని విజయ శేఖరుడు పరిపాలిస్తు విద్యాదాతగా పేరు పొందాడు. అతని ఆర్థిక సహకారంతో సదానందుడు రాజ్య శివార్లలలో గురుకులం నిర్వహిస్తున్నాడు, సదానందుని నిర్వహణలో ఇప్పుడు నిరాదరులకు ఆశ్రమం నిర్మించారు. దాని నిర్వాహణకు సేవాభావం, నిజాయితి కలిగిన ఇద్దరు వ్యక్తులు అవసరమైనారు. ఆ పదవికి పలువురు వచ్చారు. పలు విధాల పరీక్షలు జరిపి చివరిగా నలుగురిని ఎంపిక చేసారు. 'నాయనలారా పొద్దుపోయింది ఈ రాత్రికి మీ నలుగురు ఇక్కడే విశ్రమించండి. మీకు ఈ రాత్రికి కావలసిన అన్ని ఏర్పాట్లు మా శిష్యులు చేస్తారు' అన్నా సదానందుడు 'గణపతి వీరికి కావలసిన ఏర్పాట్లు చేయించు' అన్నాడు. ఆ యువకులకు ఇద్దరికి ఒక గదిలో, మరో ఇద్దరికి మరో గదిలో మంచాలు ఏర్పాటు చేయబడ్డాయి. భోజనానంతరం, మొదటి గదిలోనికి వెళ్ళిన సదానందుని శిష్యుడు గణపతి "నాయనలారా మీ పేర్లు" అన్నాడు. "నాపేరు రామయ్య, ఇతని పేరు సోమయ్య" అన్నాడు ఆ గదిలోని యువకుడు.

"నేను సదానందులవారి ప్రథమ శిష్యుడను, ఈ నిరాదరుల ఆశ్రమ నిర్వాహణా బాధ్యత మీకు వచ్చేలా చేస్తాను మీరు పదవి చేపట్టిన అనంతరం చెరి ఐదు వందల రూకలు నాకు ఇవ్వాలి ఇది మీకు సమ్మతమేనా?" అన్నాడు గణపతి.


సమ్మతమే అని తల ఊపారు ఆ ఇరువురు యువకులు. రెండో గదిలోనికి వెళ్ళిన గణపతి "నాయనలారా మీపేర్లు" అన్నాడు. "నా పేరు శివయ్య, ఇతని పేరు రంగనాథం" అన్నాడు. మొదటి గదిలో చెప్పిన మాటలే వీరికి చెప్పాడు. "పెద్దలు మన్నించాలి మేము లంచం ఇవ్వం తప్పుడు మార్గంలో పొందే పదవి జీవితాంతము తప్పుడు మార్గాన్నే నడిపిస్తుంది. మా నిజాయితీకి తగిన ఉద్యోగం ఇక్కడ కాకుంటే ఎక్కడైనా, ఎప్పుడైనా లభిస్తుంది తమవంటి వారికి

ఈ తప్పుడు పని తగదు అన్నారు. "మీ ఇష్టం" అని గణపతి వెళ్ళిపోయాడు. తెల్లవారుతూనే కాలకృత్యాలు తీర్చుకుని ఓ కుటీరంలో సదానందుని కలసారు. ఇంతలో కుటీరం ముందు ఉన్న రహదారిన వెళుతున్న అంధుడు ముందుకు పడిపోయాడు, అతని చేతి సంచిలోని వస్తువులన్నీ రహదారిపై పడ్డాయి. అది చూసిన శివయ్య, రంగనాధాలు పరుగున వెళ్ళి ఆ వృద్ధుని లేవదీసి, అతని సరుకులను చేతి సంచిలో పెట్టి, చేతికర్ర తోపాటు ఆ వృద్ధునికి అందించారు. అదే దారిన వెళుతున్న ఓ వ్యక్తి 'అయ్యా ఈ వృద్ధుడు మా ఊరివాడే నేను ఇతన్ని మా ఊరు తీసుకు వెళతాను' అని వృద్ధునితో వెళ్ళిపోయాడు. శివయ్య, రంగనాధం కుటీరంలోనికి వచ్చి తమ ఆసనాలపై కూర్చున్నారు.

"నాయనా రామయ్య, సోమయ్య రహదారిలో అంధుడైన ఆ వృద్ధుడు పడిపోతే మీలో ఎటువంటి చలనం లేదు చూస్తూ ఉండిపోయారు. శివయ్య, రంగనాధాలు పరుగున వెళ్ళి ఆ వృద్ధుడిని ఆదుకున్నారు. అంధుడైన ఆ వృద్ధుని నేనే ఏర్పాటు చేయించాను. గత రాత్రి మా గణపతి అడిగిన లంచం ఇవ్వడానికి మీరు సమ్మతించినపుడే మీరు నిజాయితీపరులు కారు అని తెలిసి పోయింది. మనిషికి దయా, కరుణా, జాలి, పాపభీతి వంటి సులక్షణాలు ఉండాలి. మానవత్వం, సహకార భావం, సేవాగుణం, నిజాయితి కలిగిన శివయ్య, రంగనాధాలను చివరి పరీక్షలో నెగ్గినందుకు ఈ పదవికి ఎంపిక చేస్తున్నాను" అన్నాడు సదానందుడు.

– బెల్లంకొండ నాగేశ్వరరావు
కాంచిపురం జిల్లా, చెన్నయ్.
m : 8179273974

# చీమ – మిడత



ఒక వేసవిలో, ఒక చీమ ప్రతిరోజూ కష్టపడి ఆహారాన్ని సేకరించి శీతాకాలం కోసం సురక్షితంగా నిల్వ చేసేది. అయితే దాని స్నేహితుడు, మిడత నవ్వుతూ, "నువ్వు చాలా కష్టపడి పని చేస్తావు! విశ్రాంతి తీసుకో!" అని అన్నది. ఆ మిడత వేసవి అంతా సిద్ధం కాకుండా ఆడుతూ, పాడుతూ గడిపింది.

కానీ శీతాకాలం వచ్చినప్పుడు, మిడత చల్లగా మరియు ఆకలితో ఉంది, అయితే చీమ తన ఇంట్లో తగినంత ఆహారంతో హాయిగా ఉంది.

కథ యొక్క నీతి: ఎల్లప్పుడూ ముందుగానే ప్లాన్ చేసుకోండి మరియు సిద్ధంగా ఉండండి. జీవితం ఎల్లప్పుడూ సులభం కాదు, కాబట్టి మీకు వీలైనప్పుడల్లా మీ అవసరాలను తీర్చుకోండి.

– Our Father's House Soup Kitchen
2380 Martin Luther King Blvd. (Hammondville Rd.)
Pompano Beach, FL 33069, South Florida
m : (954) 968-7550

# వాన



తడిసింది చాలు
ఇకనైనా లోనికొస్తే మేలు
జలుబు చేస్తే కష్టం...
జ్వరం వస్తే నష్టం...
ఆపై... ఇక... నీ ఇష్టం...

– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105




తెలంగాణ భారతదేశంలోని ఒక రాష్ట్రం. దీని పేరును తెలంగాణ లేదా తెలింగన అని కూడా పిలుస్తారు. దేశంలోని దక్షిణ-మధ్య భాగంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో సరిహద్దులుగా ఉంది. 2014లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడడానికి ముందు తెలంగాణ ఆరు దశాబ్దాల పాటు ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉంది. తెలంగాణ ప్రజలలో దాదాపు నాల్గింట మూడు వంతుల మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అతిపెద్ద నగరం రాజధాని హైదరాబాద్. హైదరాబాద్ వాణిజ్యం మరియు సమాచార సాంకేతికత (ఐటీ) కేంద్రంగా ఉంది. తెలంగాణలోని ఇతర ప్రధాన నగరాల్లో వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ మరియు ఆదిలాబాద్ ఉన్నాయి.

### భూమి మరియు వాతావరణం

తెలంగాణ భూభాగంలో ఎక్కువ భాగం దక్కన్ (భారత దేశంలోని దక్షిణ ప్రాంతం) యొక్క ఎత్తైన ప్రాంతంలో పీఠభూములను కలిగి ఉంది. పీఠభూములు తూర్పు మరియు ఈశాన్య దిశగా క్రిందికి వాలుగా ఉంటాయి, అక్కడ అవి తూర్పు కనుమల పర్వత శ్రేణిని కలుస్తాయి. రాష్ట్రంలోని ప్రధాన నదులు కృష్ణ, గోదావరి మరియు మంజీరా.

### ప్రజలు మరియు సంస్కృతి

ఉత్తర మరియు దక్షిణ భారతదేశం మధ్య కూడలిలో ఉన్న తెలంగాణలో వైవిధ్యభరితమైన జనాభా ఉంది. అధికారిక మరియు విస్తృతంగా మాట్లాడే భాష తెలుగు. ఉర్దూ, హిందీ, కన్నడ మరియు మరాఠీ కూడా మాట్లాడతారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ తెగలు - స్థానిక ప్రజల అధికారిక పేరు - లంబాడి (బంజారి) మరియు ఇతర భాషలు మాట్లాడతారు. తెలంగాణలోని అత్యధిక శాతం మంది ప్రజలు హిందువులు. ముస్లింలలో చిన్న వర్గాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రజలలో దాదాపు పావు వంతు మంది షెడ్యూల్డ్ తెగలు లేదా షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు - ఇది సాంప్రదాయకంగా కుల వ్యవస్థలో తక్కువ స్థానాన్ని కలిగి ఉన్న తరగతులకు అధికారిక పదం.

### చరిత్ర

క్రీస్తుపూర్వం 1000 నాటి సంస్కృత రచనలలో "ఆంధ్ర" ప్రజలు ఇప్పుడు తెలంగాణ ప్రాంతంలో నివసించారని పేర్కొన్నారు. ఈ ప్రాంతం క్రీస్తుపూర్వం 4 నుండి 2వ శతాబ్దాలలో మౌర్య సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. బౌద్ధ శాతవాహన రాజవంశం క్రీ.శ. 1వ శతాబ్దంలో అధికారాన్ని చేపట్టి దాదాపు మొత్తం దక్కన్‌ను నియంత్రించింది. 17వ శతాబ్దంలో ఇప్పుడు తెలంగాణగా ఉన్న ప్రాంతం హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉండేది. 1947లో భారతదేశం స్వతంత్రమైనప్పుడు, హైదరాబాద్ మొదట్లో ఒక సంస్థానంగానే కొనసాగింది. అయితే, 1948లో భారతదేశం దీనిని ఆక్రమించిన తర్వాత, హైదరాబాద్ భారతదేశంలో భాగమైంది. 1956లో హైదరాబాద్ రాష్ట్రం విభజించబడింది, తెలంగాణ కొత్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో భాగమైంది. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల కంటే ఆర్థికంగా మరియు సామాజికంగా వెనుకబడి ఉన్న తెలంగాణలో అసంతృప్తి పెరిగింది. 1960లలో తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా చేయాలనే ఉద్యమం తలెత్తింది. 2001 నుండి తెలంగాణ రాష్ట్ర హోదా గురించి మలిదశ ఉద్యమాలు చాలా సంవత్సరాలుగా ఉవ్వెత్తున కొనసాగాయి. జూన్ 2, 2014న, తెలంగాణ భారతదేశ 29వ రాష్ట్రంగా అవతరించింది. హైదరాబాద్ తెలంగాణ రాజధానిగా మిగిలిపోయింది.

– బాలచెలిమి డెస్క్



# కాలం లెక్కలు - 4

బుక్ ఆఫ్ జెనెసిస్ అనే బైబిల్ భాగంలో దేవుడు రెండు వెలుగులను సృజించెను. పగటిని పాలించుటకు గొప్ప వెలుగును, రాత్రిని పాలించుటకు కొంత తక్కువ వెలుగును ఆయన సృజించెను, అని అర్థం వచ్చే మాట చెప్పబడి ఉంది. ఈజిప్టు వారు కూడా సూర్యచంద్రులను రెండు కాంతులు అన్నారు. రా అనే దేవుడి రెండు కళ్ళు అవి అన్నారు. భగవంతుని మనసు నుండి చంద్రుడు, కనుల నుండి సూర్యుడు పుట్టినట్టు హైందవ సంప్రదాయం చెబుతుంది. బెంగాల్‌లోని ముండా వారి సంప్రదాయం ప్రకారం సూర్యచంద్రులు భార్యాభర్తలు. బెంగాలీలు సూర్యుడిని సింగ్ బొంగా అని ప్రేమగా పిలుచుకుంటారు. వారి ఆలోచన ప్రకారం సూర్యుడు మృదు స్వభావ్ గలవాడు. మనుషుల జీవితాలలో కల్పించుకోడు. బెంగాల్లోని మరొక సంప్రదాయం ప్రకారం మగవాడైన సూర్యుడికి మూడు కళ్ళు ఉంటాయి. నాలుగు చేతులు ఉంటాయి. మరీ వెలుగుతుంటాడు. కాబట్టి విసిగిపోయి అతని పెళ్లాం వదిలేసి పారిపోయింది. అతనికి బదులు ఛాయా అనే చీకటి దేవతను స్థాపించింది. భరించలేక సూర్యుడు తన వెలుగును తగ్గించుకుని మళ్లీ భార్యను దగ్గరకు తీశాడు. ఈ రకంగా సూర్యచంద్రులను గురించి ప్రపంచమంతటా ఎన్నెన్నో కథలు ఉన్నాయి.

– గోపాలం కె బి
m : 98490 62055

## సామెతలు

- అదను ఎరిగి సేద్యం, పదును ఎరిగి పైరు
- అనుభవమే శాస్త్రం, మాటలే మంత్రాలు
- ఆపదలో ఆదుకునే వాడే చుట్టం
- ఆరు నెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారు
- ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత
- ఇనుము విరిగితే అతకవచ్చు, మనసు విరిగితే అతకలేము
- ఈగను కప్ప మింగితే, కప్పను పాము మింగుతుంది
- ఈనిన పులి పైనబడినట్లు
- ఉడతల ఊపులకు చెట్లు ఊగునా
- ఉన్న వూరు కన్నతల్లి వంటిది

– బాలచెలిమి

సీరియల్

# బంగారు మర్రి



(బాలలకోసం ఆధునిక సాహస నవల)

**(బాలసాహితీవేత్తగా పైడిమర్రి రామకృష్ణ గారు సుపరిచితులు. బాలల కోసం దాదాపు 600 పైగా కథలు రాసారు. ఎక్కువగా బాలమిత్రలో వారి కథలు అచ్చయ్యాయి. రేడియో కోసం అనేక కథలు, నాటికలు రాసారు. మామయ్య డాట్‌కామ్, అనగనగా ఒక అడవి, రంగులరాట్నం, చింటూగాడి కథలు, మృగరాజు తీర్పు, గుడ్డేలుగు బలగం, తాంబేలు ఇగురం కథలు సంపుటాలుగా వచ్చాయి. తెలంగాణ భాషలో జోర్దార్ కథల సంపుటి వచ్చింది. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారం, చింటూ గాడి కథలకు బాలసాహితీ పురస్కారం అందుకున్నారు. వివిధ సాహితీ సంస్థల నుంచి అనేక అవార్డులు, సన్మానాలు పొందారు. ఒక కథ పిల్లల కోసం రాయాలంటే రచయిత బాలల స్థాయికి ఎదిగి రాయాలి అంతే గాని దిగి కాదు అని ఆయన అభిప్రాయం. బాలచెలిమిలో ఒక సీరియల్ తెస్తే బావుంటుందని ఆలోచిస్తున్న సమయంలో పైడిమర్రి రామకృష్ణగారు "బంగారుమర్రి" ని బాలచెలిమి అందించారు. ఇది పిల్లలను, బాలచెలిమి పాఠకులను అలరిస్తుందని ఆశిస్తున్నాం - సంపాదకుడు)**

సూర్యుడు పడమటి దిక్కు నెమ్మదిగా అస్తమిస్తున్నాడు. పక్షులు గూటికి చేరుకుంటున్నాయి. ఆ సమయంలో ఎప్పుడూ పక్షుల కిలకిలా శబ్దాలతో అడవి మారుమ్రోగేది. కానీ ఆ సాయంత్రం నల్లమల అడవంతా నిశ్శబ్దంగా ఉంది.

మృగరాజు సింహం బంగారుమర్రి వేదిక మీద విచారంగా కూర్చున్నాడు.

వేదిక చుట్టూ అడవి జీవులు మౌనంగా నిలుచున్నాయి. బంగారుమర్రి ఐదువందల సంవత్సరాల పురాతన మర్రి చెట్టు. వన్యప్రాణులు బంగారుమర్రిని వనదేవతగా కొలిచేవి.

తమకు వచ్చిన కష్టం బంగారుమర్రికి చెపితే తీరుస్తుందని నమ్మకం. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మృగరాజు సింహం కొద్దిసేపు బంగారుమర్రి వేదిక మీద కూర్చుంటాడు. వన్యప్రాణులు తమ కష్టాలను అక్కడ మృగరాజుకు చెప్పుకుంటాయి. సింహం వాటి సమస్యలు విని వెంటనే పరిష్కరించేది. ప్రతిరోజూ ఏనుగు, ఎలుగు బంటి, నక్క, కోతి బంగారుమర్రికి వచ్చి మృగరాజును తప్పక కలిసేవి. అడవిలోని మంచిచెడ్డలు మాట్లాడుకునేవి. ఈ నాలుగు మృగరాజుకు చేదోడు వాదోడుగా ఉండేవి. మృగరాజుకు కూడా వీటిని ప్రేమగా ప్రాణంతో సమానంగా చూసుకునేవాడు. ఇక మరో మిత్రుడు పులి. మృగరాజుకు ప్రాణమిత్రుడు.

దాంతో పులికి కూడా అడవిలో మృగరాజుతో సమానంగా గౌరవ మర్యాదలుండేవి. వన్యప్రాణులన్నీ 'పులిరాజు' అని పిలిచేవి. పులికి సిగ్గెక్కువ. అది ఇతర జంతువులతో ఎక్కువగా కలిసేది కాదు. ఒంటరిగా ఉండటానికే ఇష్టపడేది. అందుకే బంగారుమర్రికి వారానికోసారి వచ్చి పోతుండేది. పులిరాజు బంగారుమర్రికి రాకున్నా మృగరాజు పులి విషయాలు తెలుసుకునేవాడు.

నిన్న సాయంత్రం నుంచి పులి అడవిలో కనిపించడం లేదు. అడవి మొత్తం ఎంత వెతికినా పులి జాడనే లేదు.

"మహారాజా! చింతించకండి! పులిరాజు కోసం అడవంతా జల్లెడ పడుతున్నాము" అంది ఏనుగు.

"అవును ప్రభూ! చీకటిపడినా అడవంతా మరో మారు గాలిస్తాం!" అంది ఎలుగుబంటి. ఇంతలో కోతి పరుగున వచ్చి "రాజా! నేను మా మూకతో అడవి నలుదిక్కులా దేవులాడాను. కానీ ఎక్కడా పులి జాడలేదు" అంది. సింహం మరింత దిగులు పడింది.

"మృగరాజా! పులిరాజు అడవి దాటి చెంచుల గూడెం వైపు వెళ్లాడేమో!" అనుమానం వ్యక్తపరిచింది కోతి.

సింహం లేచి నిలుచుంది. "ఐతే పదండి! చెంచుల గూడెం వెళదాం!" అంది సింహం.

"ఆవేశ పడకండి ప్రభూ! చెంచుల గూడానికి ఇప్పుడు పోవటం సరికాదు. చీకటి పడనీయండి!" అంది ఎలుగుబంటి.

"చెంచులు మన శత్రువు లేమీ కాదు. అడవిని కాపాడే సైనికులు. వారితో మనకు ఏమీ ప్రమాదం లేదు. పదండి!" అంది సింహం.

"చెంచులు శత్రువులు కాకున్నా, మనల్ని అడవి దాటనీయరు. అడవిలోకి వేటగాళ్లను రానీయరు. ఐనా వాళ్లూ మనుషులే! మనం మనుషులతో జాగ్రత్తగా ఉండాలి" అంది ఏనుగు.

సింహం మౌనంగా ఉండిపోయింది. చెంచులు క్రూరమృగాలని చంపరు. వారు కేవలం అటవీ సంపద మీద ఆధారపడి బ్రతుకు జీవనం సాగిస్తారు. చిన్న చిన్న జంతువుల్ని, భూమిలో మొలిచే దుంపలు, గడ్డలు, పళ్లు, చేపల్ని ఆహారంలో తీసుకుంటారు. చెంచులకు వ్యవసాయం చేయటం అంతగా రాదు. వస్తు మార్పిడి మీదే వారు తమకు కావాల్సిన వస్తువులను మార్చుకుంటూ ఉంటారు. చెంచులకు బయటి ప్రపంచం పెద్దగా తెలియదు. ఇతరులను నమ్మరు. వారు తమ తెగ వారితో తప్ప ఇతరులతో మాట్లాడడానికి యిష్టపడరు.

ఆరోగ్యవంతమైన చెంచు యువతను టైగర్ ట్రాకర్, బేస్ క్యాంపు వాచర్లుగా ప్రభుత్వం నియమించుకుంది. వీరి ప్రధాన బాధ్యతలు పులులు ఏ ప్రాంతాల్లో సంచరిస్తున్నాయో గమనించటం. పులులు అడవి దాటకుండా చూడటం. జంతువులను వేటాడే వారిని అడవిలోకి రాకుండా చూడటం. వాకీటాకీల ద్వారా ఎప్పటికప్పుడు పై అధికారులకు సమాచారం అందించటం వీరి పని.

ఉదయాన్నే ఆరు గంటలకు పెంట నుంచి అడవిలోకి వెళ్లి తిరిగి సాయంత్రం ఆరుగంటలకు ఇంటికి చేరుతారు.

పెంట అంటే వారు నివసించే గూడెం. అటవీశాఖలో క్రింది స్థాయి నుండి పై స్థాయి వరకు పటిష్టమైన వ్యవస్థ ఉంది. అటవీశాఖ అధికారులు ఎంత గస్తీ తిరుగుతున్నా పులులు అడవి దాటడం, వేటగాళ్లు అడవిలోకి ప్రవేశించటం జరుగుతోంది.

చీకటి పడుతుండగా మృగరాజు సింహం, ఎలుగుబంటి, ఏనుగు, కోతి చెంచుల పెంటవైపు అడుగులు వేశాయి. వాటి కండ్లు చీకట్లో చింత నిప్పుల్లా వెలుగుతున్నాయి. దారిలో వాటికి నలుగురు వేటగాళ్లు మంటలు వేసుకుని మాంసాన్ని కాల్చుకుంటూ కనిపించారు. వారి చేతిలో తుపాకులున్నాయి.

అవి నెమ్మదిగా పక్కనే ఉన్న పొదల్లో నక్కి గమనించసాగాయి. వారి పక్కనే ఒక జీపు ఉంది. అందులో ఒకడు మద్యం తాగుతూ కనిపించాడు. మంట వెలుతురుకు మెరుస్తూ రక్త మంటిన కత్తులు, లైటింగ్ కోసం తెచ్చుకున్న పెద్ద బ్యాటరీలు కనిపించాయి.

మరో పక్కన ఏదో జంతువు చర్మం కనిపించింది. పొదల్లో నక్కిన సింహానికి మిత్రుడు పులి గుర్తుకు వచ్చింది. అంతే.. పెద్దగా గర్జిస్తూ పొదల్లోంచి బయటకు వచ్చింది. అది గమనించిన వేటగాళ్లు చేతిలోని తుపాకులు పేల్చారు. ఏనుగు, ఎలుగుబంటి, కోతి కూడా బయటకు వచ్చాయి. వేటగాళ్లు తుపాకులు పేల్చుకుంటూ జీపులో గ్రామం వైపు పారిపోయారు. అవి నాలుగు జీపుని కొంచెం దూరం వెంబడించి వెనుతిరిగాయి. తుపాకుల శబ్దానికి చెంచుల గూడాలు మేల్కొన్నాయి.

"ప్రభూ! మనం ఇక్కడ ఉండటం ప్రమాదం. బంగారుమద్రికి తిరిగిపోదాం!" అంది ఎలుగుబంటి. అవి నాలుగు అడవిలోకి పరుగు తీశాయి. (సశేషం...)

– పైడిమర్రి రామకృష్ణ
m : 9247564699

కథ



# ఏనుగు



ఒక భారతీయుని దగ్గర ఒక ఏనుగు ఉండేది. సరిగా తిండి పెట్టకుండా దానితో చాలా పని చేయిస్తూ ఉండేవాడు యజమాని. ఒకనాడు ఏనుగుకు పట్టరాని కోపం వచ్చి, యజమానిని కాలి కింద వేసి తొక్కేసింది. యజమాని చచ్చిపోయాడు. అది చూసి అతని భార్య భోరున ఏడ్చి, తన పిల్లల్ని ఏనుగు దగ్గరకు తీసుకుని వచ్చి, దాని కాళ్ల కింద పడేసి, “ఓ ఏనుగా! ఈ పిల్లల తండ్రిని చంపనే చంపావు, వీళ్లను కూడా చంపేయ్!” అంది. పిల్లల వైపు చూసి, వాళ్లందరిలోనూ పెద్దవాడిని తన తొండంతో పైకెత్తి, తన కుంభస్థలం మీద కూర్చోబెట్టుకుంది ఏనుగు. ఆనాటి నుంచి ఆ పిల్లవాడు చెప్పినట్టు విని, ఆ కుటుంబం కోసం ఎంతో విశ్వాసంతో పని చేసింది ఏనుగు.


– లియో టాల్‌స్టాయ్
బాలల కథలు నుండి



# మూడుకాళ్ళ పరుగు



కావలసిన వస్తువులు:



కర్ఛీఫ్‌లు – 4



**ఎంత మంది పాల్గొన వచ్చు – ఎనిమిది మంది**

**ఎక్కడ ఆడవచ్చు – ఆరు బయట**

'మూడు కాళ్ళ పరుగు'లో ఆటగాళ్ళు జంటలుగా విడిపోయి ఒకరి భుజాలపై ఇంకొకరు చేతులు వేసి నిలబడతారు.

ఒక ఆటగాడి కుడి కాలిని ఇంకొక ఆటగాడి ఎడమ కాలిని కలిపి కర్ఛీఫ్‌తో కట్టాలి. ఇలా 4 జంటలు కట్టుకొని నిలబడ్డాక 25 అడుగుల దూరంలో ఒక టార్గెట్‌ను నిర్ణయించాలి. లీడర్ విజిల్ వేసిన తరువాత జంట ఆటగాళ్ళు స్పీడుగా నడవగలగాలి. అంటే ఇప్పుడు వాళ్ళు మూడు కాళ్ళతో నడుస్తారన్న మాట.

ఏ జంట కూడ నేలమీద పడిపోకూడదు. పడిపోతే వారు ఓడిపోయినట్టే. ఎవరు తొందరగా టార్గెట్ చేరితే ఆ జంట గెలిచినట్టు.

**ప్రయోజనం:** ఈ ఆట ఆడటం ద్వారా పిల్లల్లో సమన్వయం అలవడుతుంది.

– 'చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు' నుండి...



యాత్ర

తెలంగాణ చారిత్రక పర్యాటకం

# ముడుమాల నిలువు రాళ్ళు - ఆదిమానవుల చరిత్రకు మైలురాళ్ళు

"మార్పు అనేది ప్రకృతి సహజ స్వభావం కొత్త రాతియుగంలో చివరి దశ అయిన బృహత్ శిలాయుగం నాటికి ఆదిమానవులు రాతిపనిముట్ల నుండి జంతువులను వేటాడటం, వ్యవసాయంలో మిగులు, పంచభూతాలను, రాళ్ళను, చెట్లను, జంతువులను పూజించటం, కుండల తయారీ, లోహాల పరిజ్ఞానం, నిర్మాణరీతులు, తొలుత రాగి, ఇనుము వాడకం మానవ మేధస్సుకు ముందడుగే. సమాధుల నిర్మాణంలో కూడా ఒక పద్ధతి, మృతదేహాల అమరిక, వారు వాడిన వస్తువులను ఒక నిర్దిష్ట ప్రణాళికలో అమర్చడం అలా మానవ పరిణామంలో మొదటిసారిగా ఒక కళాత్మక సృజనను ముందుకు తెచ్చింది. మనిషి పుట్టుక నుండి మరణించేవరకు మరణం తర్వాత కూడా చేసే పూజలు, క్రతువులు వివిధ తంతులూ నాటి రాతియుగం నుంచి నేటి ఆధునిక యుగం వరకూ ఏదో ఒక రూపంలో కొనసాగింపును మనం గమనించవచ్చును. బృహత్ శిలాయుగపు సమాధులే క్రీ.పూ. ఆరో శతాబ్దం నాటికి బౌద్ధ స్థూపాలుగా, అలాగే సమాధులపై నిలిపిన నిలువు రాళ్ళు (మెన్హర్లు) తర్వాతి కాలంలో వీరశిలలైనాయి. ఇప్పటికీ మనం అమరులను స్మరించుకొనే అమరుల స్థూపాలుగా కాలంతో పాటుగా రూపాంతరం చెందాయి.

సరిగ్గా ఇంగ్లాండ్‌లోని స్టోన్ హేంజ్ రాతి అమరికను పోలిన ఒక ప్రాచీన ఖగోళ అద్భుతం నాటి ఉమ్మడి మహబూబ్‌నగర్, నేటి నారాయణపేట జిల్లా, క్రిష్ణా మండలం క్రిష్ణానది ఒడ్డున గల ముడుమాల అనే గ్రామంలో ఆవిష్కృతమైంది. ఈ అరుదైన స్మారక శిలలు (మెన్హర్లు) ఇవి భూమి ఉపరితలంపై 14 నుంచి 18 అడుగుల ఎత్తులో 80 నిలువు రాళ్ళు ఒక పద్ధతిగా అమర్చినట్టుగా ఉన్నాయి. ఇవి సుమారు ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉండగా దాని చుట్టూ పది పదిహేను ఎకరాల్లో 1 నుండి 2 అడుగుల ఎత్తున్న రాళ్ళు సుమారుగా 2000 వరకు క్రమపద్ధతిలో అమర్చబడి ఉన్నవి. ఇప్పటికి సుమారు 4 వేల ఏండ్ల కిందటే ఏర్పాటైన ఈ అంతరిక్ష ప్రయోగశాల క్రీస్తుపూర్వం 2000 నాటి నుంచి 1000 మధ్యకాలంలో నాటి ఆదిమానవులు ఏర్పాటు చేసిన ఈ రాతిక్రమం దేశంలోనే అంతరిక్ష పరిశోధన చేసిన ఆసియా ఖండంలోనే మొట్ట మొదటి ఖగోళ శాస్త్ర పరిశోధనా కేంద్రంగా ముడుమాల గుర్తింపు పొందింది. అంతేకాక ఇక్కడ ఒకే బండపై ఆకాశంలో మనకు కన్పించే సప్తఋషి మండలం చిత్రం కూడా గుంతల రూపంలో చెక్కబడి ఉంది. మొదట ఈ ప్రాంతాన్ని 1956లో ఎఫ్.ఆర్. అల్చిన్ అనే విదేశీ పురాతత్వ శాస్త్రవేత్త ప్రపంచానికి పరిచయం చేశారు. వేల ఏళ్ళ క్రితమే ఖగోళ శాస్త్ర పరిశోధనలకు ముడుమాల ఒక కేంద్రంగా నిలిచిందని దశాబ్ద కాలం పాటు ఈ నిలువు రాళ్ళపై పరిశోధన చేసి దేశ విదేశాల్లో పరిశోధనా పత్రాలు రాసిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం చరిత్ర శాఖ అధ్యాపకులు ప్రొ.కె. పుల్లారావు కృషితో మెగాలిథిక్ ఆస్ట్రానమీ అంటే బృహత్ శిలాయుగపు ఖగోళ శాస్త్రానికి ముడుమాల ఒక మ్యూజియంగా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించగలిగింది. తద్వారా దేశవిదేశీ పరిశోధకులు ఈ నిలువు రాళ్ళను అధ్యయనం చేస్తున్నారు. ఇంగ్లాండ్‌లోని స్టోన్‌హెంజ్ నిర్వాహకులు ఈ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. ఇక్కడ కొన్ని నిలువు రాళ్ళ వరుసలు ఉత్తరాయణం, దక్షిణాయణం, సూర్యోదయం, సూర్యాస్తమయ సమయంలో ఒకే వరుసలో ఉండటం ఆనాటి ప్రజలు ఈ రాళ్ళను సౌరగతిని సునిశితంగా పరిశీలించే ఈ క్రమంలో ఏర్పాటు చేసి ఉంటారు. దీంతో సౌరసంచారం రుతువుల మార్పుల

క్రమాన్ని నిత్య జీవితంలో ఆధారపడ్డ వ్యవసాయానికి నిలువు రాళ్ళు ఒక దిక్సూచిగా ఉపయోగపడిందని చెప్పవచ్చు! వేల యేండ్లుగా ఈ నిలువు రాళ్ళు నాటి చరిత్రకు సైనికుల్లా నిలబడి పహారా కాస్తున్నా, నేటి జనాభా పెరుగుదల, విస్తరిస్తున్న వ్యవసాయం, భూకాంక్ష తదితర కారణాల వల్ల కొన్ని నిలువురాళ్ళు నేలకొరిగాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వారసత్వ శాఖ, ఆర్కిటెక్టులు, నిపుణులు ముఖ్యంగా 2021 నుండి డెక్కన్ హెరిటేజ్ అకాడమీ సంస్థ ముఖ్యులు వేదకుమార్ ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వ DHT (Department of Heritage Telangana), కేంద్ర ప్రభుత్వ ASI (Archaeological Survey of India)లతో కలిసి కేంద్రీయ సాంస్కృతిక శాఖకు ఒక సమగ్ర నివేదికను సమర్పించింది. తద్వారా గత మార్చి 2025లో ప్రపంచ వారసత్వ సంస్థ (యునెస్కో) తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్న మన ముడుమాల నిలువు రాళ్ళు తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే జులై 2021లో ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం సరసన సగర్వంగా నిలబడేందుకు మరో అడుగు దూరంలో ఎదురు చూస్తున్నాయి ఆదిమానవుల చారిత్రక మైలు రాళ్ళు – మన ముడిమాల నిలువురాళ్ళు! ఇక్కడ మృతుల గౌరవ చిహ్నంగా నిలువు రాళ్ళను వైజ్ఞానిక అంశాలతో, ఖగోళశాస్త్ర పరిశోధనశాలగా వేల ఏండ్ల కిందటే ఏర్పాటు చేయటం, నాటి మానవ మేధస్సు ఎదిగిన క్రమం మనందరికి నిజంగా గర్వకారణం!

– దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి
m : 9010051177

## తెలుగు వాళ్ళకు కారాలంటే ఎంతో ఇష్టం
## ఈ కారాలను చూడండి...

1. మొదలు పెట్టే కారం – శ్రీకారం
2. గౌరవించే కారం – సంస్కారం
3. ప్రేమలో కారం – మమకారం
4. పలకరించే కారం – నమస్కారం
5. పదవితో వచ్చే కారం – అధికారం
6. అది లేకుండా చేసే కారం – అనధికారం
7. వేళాకోళంలో కారం – వెటకారం
8. భయంతో చేసే కారం – హాహాకారం
9. బహుమతితో కారం – పురస్కారం
10. ఎదిరించే కారం – ధిక్కారం
11. వద్దని తిప్పికొట్టే కారం – తిరస్కారం
12. లెక్కల్లో కారం – గుణకారం
13. గుణింతాల్లో కారం – నుడికారం
14. గర్వంతో వచ్చే కారం – అహంకారం
15. సమస్యలకు కారం – పరిష్కారం
16. ప్రయోగశాలలో కారం – ఆవిష్కారం
17. సంధులలో కారం – 'అ' కారం
18. సాయంలో కారం – సహకారం
19. స్త్రీలకు వచ్చే కారం – అలంకారం
20. మేలు చేసే కారం – ఉపకారం
21. కీడు చేసే కారం – అపకారం
22. శివునికి నచ్చే కారం – ఓంకారం
23. విష్ణువులో కారం – శాంతాకారం
24. ఏనుగులు చేసేది – ఘీంకారం
25. మదంతో చేసే కారం – హుంకారం
26. పైత్యంతో చేసే కారం – వికారం
27. రూపంతో వచ్చే కారం – ఆకారం
28. ఇంటి చుట్టూ కట్టే కారం – ప్రాకారం
29. ఒప్పుకునే కారం – అంగీకారం
30. చీదరించుకునే కారం – చీత్కారం
31. పగ తీర్చుకునే కారం – ప్రతీకారం
32. వెలివేసే కారం – బహిష్కారం



అందరికి నమస్కారం

– మడపతి రాజు
M.A., B.Ed, M.Ed.,
Telugu Teacher, Oxford Grammar
School, Himayathagar, Hyderabad.

పండుగ





# త్యాగ భావానికి ప్రతీక బక్రీద్

**తేజ:** అబ్దుల్లా అన్నా... బావున్నారా? ఈ మధ్య కనిపించడం లేదు ఊరికి పోయారా?

**అబ్దుల్లా:** ఔను... తమ్మి "హజ్ యాత్ర" పోయాము మొన్ననే ఇల్లు చేరాము.

**తేజ:** అంటే తీర్థయాత్ర అన్నా?!

**అబ్దుల్లా:** మీ భాషలో అంతే. ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో ఒక్కసారి అయినా ఈ 'హజ్‌యాత్ర' చెయ్యాలి అంటారు.

**తేజ:** అది ఎక్కడ ఉంది? ఇంతకీ యాత్ర ఏ సమయంలో చేయాలి?

**అబ్దుల్లా:** సౌదీ అరేబియా దేశంలోని పవిత్ర ప్రదేశం "మక్కా" నగరం. ఇక ఈ యాత్ర మా ఇస్లాం క్యాలెండర్ ప్రకారం మొదటి నెల జుల్ – హజ్జ నెల. ఈ నెలలోనే రంజాన్ తరువాత అంత ముఖ్యమైన బక్రీదు పండుగ వస్తుంది. ఈ నెలలోనే మేము ఈ పవిత్ర యాత్ర చేస్తాము.

**తేజ:** అక్కడ ఉన్న ప్రత్యేకత ఏమిటి?

**అబ్దుల్లా:** మా ఇస్లాం మత విశ్వాసం ప్రకారం చెప్పే కథనం ఏమిటంటే మా దేవుడు "అల్లా" పంపిన ప్రవక్తల్లో "ఇబ్రహీం" అనేవాడు ఒకరు. ఆయనే "మక్కా" పట్టణం నిర్మించి అల్లాను ప్రార్థించడానికి "కాబా" కూడా నిర్మించి నిత్యం ప్రార్థనలు చేస్తూ దైవ ప్రవక్తగా అక్కడే జీవిస్తుండేవాడు. ఇబ్రహీం దంపతులకు చాలా కాలానికి కొడుకు జన్మించాడు. అతనికి "ఇస్మాయిల్" అని పేరు పెట్టుకుని అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న సమయంలో ఒక రోజు ఇబ్రహీంకు తన కొడుకును చంపుతున్నట్టు కల వచ్చింది. అల్లానే బలి కోరుతున్నాడు అని భావించి ఒంటెను బలి ఇస్తాడు.

**తేజ:** బలి ఇవ్వడం అంటే చంపడమే కదా?

**అబ్దుల్లా:** ఔను... అయితే ఒంటెను బలి ఇచ్చినా మరుసటి రోజు మళ్లీ అదే మాదిరి కల రావడంతో అల్లా తన ఏకైక కొడుకు ఇస్మాయిల్‌నే అర్పించమని అడుగుతున్నాడని భావించి ఆ విషయం కొడుకుకు చెబుతాడు.

**తేజ:** మరి అందుకు కొడుకు ఒప్పుకుంటాడా?!

**అబ్దుల్లా:** అల్లా కోరిక తీర్చడం కోసం తాను ప్రాణత్యాగానికి సిద్ధపడతాడు బాలుడైన ఇస్మాయిల్.

**తేజ:** గ్రేట్ కదా?!

**అబ్దుల్లా:** నిజమే చాలా కాలానికి కలిగిన కొడుకును అల్లా కోరిక ప్రకారం బలి ఇవ్వడానికి సిద్ధపుతారు ఇబ్రహీం దంపతులు. అప్పుడు ఆ దంపతుల దైవభక్తి త్యాగగుణానికి మెచ్చిన అల్లా ఇస్మాయిల్‌కు బదులు ఒక జీవాన్ని బలి ఇవ్వమని దూత ద్వారా

సందేశం పంపుతాడు. అప్పటి నుంచే "బక్రీద్" జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

తేజ: అసలు "బక్రీద్" అంటే అర్థం ఏమిటన్నా?!

అబ్దుల్లా: "బకర్ ఈద్" అనే పదమే కాలక్రమంలో "బక్రీద్"గా మారింది. "బకర్" అంటే మూగజీవి "ఈద్" అంటే పండుగ మూగజీవిని బలి ఇచ్చే పండుగ త్యాగానికి ప్రతిరూపంగా ఈ పండుగను జరుపుకుంటాము.

తేజ: మొదటి నెల జుల్‌హజ్‌లో ఏ రోజు ఈ బక్రీద్ పండగ చేస్తారు? ఎలా చేస్తారు? వివరంగా చెప్పన్నా?!

అబ్దుల్లా: అట్లనె తమ్మి... ఆ నెలలో 10వ రోజున ఈ బక్రీదు పండుగ చేస్తాము. ఆ రోజు తెల్లవారు ఝామునే చిన్నా పెద్ద మగవాళ్లు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి "ఈద్గా" అని పిలిచే సామూహిక ప్రార్థన స్థలంకు చేరి అల్లాను స్మరిస్తూ ప్రత్యేకంగా "నమాజ్" చదువుతాము.

తేజ: ఈ ప్రార్థనలో కేవలం మగవారు మాత్రమే ఉంటారా?!

అబ్దుల్లా: ఔను తమ్మీ... ఇక ప్రార్థనలు అయ్యాక రెండవ ఘట్టం ఉంటుంది అదే "ఖుర్బానీ".

తేజ: "ఖుర్బానీ" అంటే ఏమిటన్నా?

అబ్దుల్లా: అసలు బక్రీద్ పండుగే భక్తునికి, దైవానికి మధ్యగల విశ్వాసానికి ప్రతిరూపం. దేవుడు పెట్టిన పరీక్షలో భక్తుడు తన విశ్వాసంతో విజయం సాధించే పండగ యిది. ఆ రోజు చిన్నారి ఇస్మాయిల్‌కి బదులు దేవుని కోరిక మేరకు గొర్రె జీవాన్ని బలి ఇచ్చారు కదా!! అదే ఆనవాయితిగా అల్లాకు జీవులను బలి ఇస్తారు. దానిని "ఖుర్బానీ" అంటారు. దీనిని చాలా నియమం ప్రకారం చేస్తారు.

తేజ: ఎలా చేస్తారన్నా?!

అబ్దుల్లా: అల్లాకు బలి ఇచ్చిన జీవి మాంసాన్ని మూడు భాగాలు చేసి ఒక భాగం కుటుంబ సభ్యులకు రెండవ భాగం బంధుమిత్రులకు, మూడో భాగం పేదవాళ్ల కోసం కేటాయిస్తారు. వాటాల పంపిణిలో ఏమాత్రం తేడా వచ్చినా దాని లక్ష్యం నెరవేరదని అల్లా ఆగ్రహిస్తాడని ప్రతి ముస్లిం నమ్మకం.



తేజ: బక్రీదు పండుగ అంటే ఇన్నాళ్లు మాంసం తినే పండుగనే తెలుసు గాని దీని వెనుక ఇంత కథ ఉందని తెలియదన్నా!!

అబ్దుల్లా: త్యాగంతో పాటు, స్వార్థం, అసూయ రాగద్వేషాలు విడిచిపెట్టి మానవత్వం చాటాలి. అన్నదే ఈ బక్రీదు పండుగ అసలు లక్ష్యం తమ్మి.

తేజ: ఇంతకీ "మక్కా"లో ఏమేమి చూసారు?

అబ్దుల్లా: ప్రపంచ దేశాల నుంచి లక్షలాది మంది ముస్లింలు ఊరేగింపుగా చేరుకుని ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేయడం. ప్రవక్తకు సంబంధించిన కట్టడాలు, మసీదు సమాధి ప్రధానంగా చూస్తాము. ఇది మా ముస్లింలు అందరూ సామూహికంగా చేసే పవిత్ర తీర్థయాత్ర అన్నమాట.

తేజ: థాంక్యూ అన్న హజ్‌యాత్ర, బక్రీద్ పండుగ గురించిన బోలెడు విషయాలు చెప్పావు.

– డా. అమ్మిన శ్రీనివాసరాజు
m : 7729883223

✤ చెట్టు - చేమ

# అల్ల నేరేడు చెట్టు



హాలో బాలలూ.. ఎలా ఉన్నారు? వేసవి సెలవు లలో బాగా ఎంజాయ్ చేశారు కదా! జూన్ మాసం వచ్చిందంటే మళ్లీ మన బడులు మొదలైనట్టే. అయితే, ఈ జూన్ నెల బాల చెలిమి సంచికలో "అల్ల నేరేడు" చెట్టు గురించి ఎన్నో విషయాలు తెలుసుకుందాం. పల్లె తల్లి ఒడిలో సహజ సిద్ధంగా పెరగడమే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా అక్కడక్కడ కనిపిస్తూ ఎన్నో ఔషధ గుణాలు కలిగిన నేరేడు చెట్లు ఎంతో విశిష్టమైనవి. ఈ చెట్లను "జామున్" అని కూడా అంటారు. ఇవి భారత దేశము మరియు ఆగ్నేయాసియాకు చెందిన ఒక ఉష్ణ మండల పండ్ల చెట్టు. దీని శాస్త్రీయ నామం "సైజీజియం". ఇది మిర్టెసి కుటుంబానికి చెందినది. మన దేశాన్ని పోర్చుగీసు వారు పాలన చేసేటప్పుడు వారి ఆధీనంలోనే ఉన్న బ్రెజిల్ దేశం నుండి ఈ చెట్ల విత్తనాలు మన దేశానికి దిగుమతిగా వచ్చినట్లు తెలుస్తుంది. ఈ చెట్లు రావి, మర్రి చెట్లంత పెద్దగా ఉండకున్నా 30 అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. ఈ చెట్లు వంద సంవత్సరాల వరకు బతుకుతాయి. నీటి ఎద్దడిని తట్టుకుంటూ ఎలాంటి పెస్టిసైడ్స్ వాడకుండా సహజ సిద్ధంగా పెరిగే ఈ చెట్ల పండ్లు ఆరోగ్యానికి ఎంతో మంచిది. వర్షాకాలం వచ్చిందంటే చాలు జూన్– జూలై మాసం నుండి అక్టోబర్ మాసం వరకు నేరేడు చెట్టు పండ్లు మార్కెట్లలో దర్శనమిస్తాయి. ఈ పండ్లు ముదురు వంకాయ రంగులో నాజూకుగా సాగదీసిన గుండ్రని ఆకారంలో నునుపుగా ఉంటాయి. వర్షాకాలంలో దొరికే సీజనల్ ఫ్రూట్స్ నేరేడు పండ్లు. ఎందరో కవులు తమ కవిత్వాలలో అందమైన స్త్రీల కనులను "నేరేడు పండ్ల వంటి నీ కన్నులు" అని పొగుడుతూ పోల్చారు. ప్రస్తుతం మన దేశంలో చాలా మంది రైతులు నేరేడు పండ్ల తోటల పెంపకాన్ని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఇది ఒక వాణిజ్య పంటగా మారింది. ఎన్నో ఔషధ గుణాలు కలిగి ప్రకృతి పరంగా మానవాళికి ఎంతో మేలు కలిగిస్తున్న నేరేడు చెట్టు యొక్క ప్రయోజనాలు మరిన్ని తెలుసుకుందాం.

## నేరేడు చెట్టు వల్ల కలిగే ప్రయోజనాలు


* నేరేడు పండ్లు తినడం వల్ల కిడ్నీలలో రాళ్లు కరిగిపోతాయి.
* ఈ పండ్లలో ఉండే సహజ సిద్ధమైన ఆమ్లాలు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి దోహదపడతాయి.
* ఈ పండ్ల విత్తనాలను ఎండబెట్టి పొడి చేసి మధుమేహ వ్యాధి నివారణలో ఉపయోగిస్తారు.
* నేరేడు చెట్ల బెరడును నీళ్లలో ఉడికించి కషాయం తీసిన నీటితో పుక్కిలిస్తే నోటిలోని అల్సర్లు తగ్గుతాయి.
* ఈ చెట్ల ఆకులు కాల్చి పొడి చేసి పండ్లు తోముకుంటే తెల్లగా మిలమిల మెరుస్తాయి.
* నేరేడు చెట్టు యొక్క చిగురుటాకులు తేనెలో కలిపి తీసుకుంటే పైత్యపు వాంతులు తగ్గుతాయి.
* నేరేడు పండ్లు తినడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
* నేరేడు పండ్లలో అధిక మోతాదులో సోడియం, పొటాషియం, కాల్షియం, ఫాస్ఫరస్, మ్యాంగనీస్, జింక్, ఐరన్, విటమిన్–సి, విటమిన్–ఏ, విటమిన్ బి2 (రిబోఫ్లేవిన్), ఫోలిక్ ఆమ్లం ఉంటాయి.
* ఈ పండ్లు తినడం వల్ల రక్తహీనత తగ్గుతుంది.
* ఈ చెట్ల కలపతో రైతులు వ్యవసాయ పనిముట్లు కూడా తయారు చేసుకుని వాడుతారు.
* ఈ పండ్లలో గింజ పెద్దగా ఉండి గుజ్జు తక్కువగా కలిగి వగరు, తీపి, కమ్మదనంగా ఉంటాయి.
* కండ్లు, చర్మం నాజూకుగా ఉండడానికి, ప్రేగుల ఆరోగ్యాన్ని పెంచే పోషకాలు ఈ నేరేడు పండ్లలో పుష్కలంగా ఉంటాయి.
* నేరేడు పండ్లలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది క్యాలరీలు తక్కువగా ఉంటాయి. పండ్లు తింటే బరువు కూడా తగ్గవచ్చు.
* ఈ పండ్లు తినడం వల్ల చిగుళ్ల వాపు సమస్యలు, నోటి దుర్వాసన నివారించవచ్చు.
* ఈ పండ్ల వల్ల చర్మం పై ముడతలు, మొటిమలు రాకుండా కాపాడుకోవచ్చు.
* కడుపులో ఉన్న మలినాలు తొలగించి జీర్ణశక్తిని మెరుగు పరుస్తాయి. కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, మోకాళ్ళ నొప్పులు తగ్గుతాయి.
* దీని ఆకులను నూరి తేలు కరిచిన చోట రాస్తే మంట, నొప్పి తగ్గుతుంది.

ఇట్లా ఎన్నో ఔషధ గుణాలు కలిగిన అల్ల నేరేడు చెట్టు "పోషకాల గనిగా, అనారోగ్యాల నివారిణిగా" పని చేస్తుంది. అందుకే ఈ చెట్లను పాఠశాలల ప్రాంగణాలలో, మన ఇంటి పెరడులో, వ్యవసాయ భూములలో పెంచుకొని మనం కూడా ఆరోగ్యపరంగా ప్రయోజనం పొందుదాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655

# స్ఫూర్తివంతమైన మైఖేల్ ఫారడే జీవితం

ఆల్బర్ట్ ఐన్‌స్టిన్ ఎంతో గౌరవంతో మైఖేల్ ఫారడే (Michael Faraday) చిత్రపటాన్ని తన స్టడీ రూమ్‌లో ఐజాక్ న్యూటన్, జేమ్స్ క్లార్క్ మాక్స్వెల్ ఫోటోలతో పాటు ఉంచుకున్నారు. కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాలకు సంబంధించిన గొప్ప పరిశోధకులు మైఖేల్ ఫారడే (1791–1867). వీరు ప్రధానంగా ఎలక్ట్రో కెమిస్ట్రీ, ఎలెక్ట్రోమాగ్నిజం సంబంధించిన గొప్ప కృషి చేశారు. ఎలక్ట్రో మాగ్నెటిక్ ఇండక్షన్, డయా మ్యాగ్నటిజం, ఎలక్ట్రోలసిస్ నియమాలను ఫారడే రూపొందించారు. కెపాసిటెన్స్ సామర్థ్యాన్ని కొలవడానికి వాడే యూనిట్‌ను ఆయన పేరును ఆధారంగా చేసుకుని 'ఫారడ్' అని నిర్ణయించారు. ఇంకా చెప్పాలంటే ఆధునిక జీవితానికి గొప్పగా సాయపడుతున్న ఎలక్ట్రిక్ మోటార్స్, ట్రాన్స్‌ఫార్మర్స్, జనరేటర్స్ వంటివి రావడానికి ఆయన చేసిన మౌలికమైన కృషి ఎంతో దోహదపడింది. రసాయన శాస్త్రవేత్తగా ఫారడే బెంజిన్‌ను కనుగొన్నారు. బున్సెన్ బర్నర్ తొలి రూపాన్ని రూపొందించారు. ఆక్సిడేషన్ నంబర్స్ విధానాన్ని తయారు చేశారు. అలాగే 'క్యాథోడ్', 'ఎలక్ట్రోడ్', 'అయాన్' వంటి పదాలను కూడా ప్రాచుర్యంలోకి తీసుకొని వచ్చారు. నిజానికి ఫారడే ఎంతో ప్రతిభావంతమైన, ప్రభావశీలమైన శాస్త్రవేత్త. వారు ప్రయోగాత్మకంగా ఆవిష్కరణలు చేశారు కానీ, సైద్ధాంతిక కృషి చేయలేదు. దానికి కారణం ఏంటంటే ట్రిగ్నోమెట్రీ ఇత్యాది గణిత శాస్త్రాలలో ఆయనకు గొప్పగా ప్రవేశం లేదు.



ఆయన విలువలు కలిగిన శాస్త్రవేత్త కనుక ప్రజా సేవకే తన సమయాన్ని, సామర్థ్యాన్ని వినియోగించారు. తన పరిశోధనా కృషితో లైట్ హౌస్ సామర్థ్యాలను పెంచారు, అలాగే ఓడలు తుప్పు పట్టకుండా జాగ్రత్త చర్యలు సూచించారు. పరిశ్రమలలో ప్రేలుళ్ళు సంభవించినప్పుడు, కోల్డ్ డస్ట్ కూడా ప్రమాదపు తీవ్రతలను పెంచుతుందని వివరించారు. పరిశ్రమలకు సంబంధించిన కాలుష్యాన్ని అధ్యయనం చేసి వారు 'ది టైమ్స్' పత్రికలో రాశారు. ఫారడే చేసిన పరిశోధనల సంఖ్య, వాటి విస్తృతి, అలాగే మానవకోటిపై వాటి ప్రభావాలను పరిశీలిస్తే, అవి సైన్స్ ప్రగతి పైన, పరిశ్రమల అభివృద్ధి పైన చాలా ప్రభావాన్ని చూపాయని భౌతిక శాస్త్రవేత్త ఎర్నెస్ట్ రూథర్ ఫోర్డ్ ప్రకటించడం విశేషం. మైఖేల్ ఫారడే జీవితం మనకు చాలా ఉత్తేజాన్ని కలిగిస్తుంది. కమ్మరి పని చేసే ఫారడే తండ్రి 1790లో సొంత ఊరును వదిలి బతుకు తెరువు కోసం లండన్‌కు తరలివచ్చారు. లండన్‌లో 1791 సెప్టెంబర్ 22న జన్మించిన మైఖేల్ ఫారడే పెద్దగా చదువుకునే అవకాశం కలగలేదు. 14 ఏళ్ల వయసులో ఒక పుస్తకాల షాపులో సహాయకుడిగా కుదిరారు. పుస్తకాల బైండింగ్ చేయడం కూడా ఆయన పనులలో ఒకటి. ఏడేళ్ల కాలంలో ఎన్నో పుస్తకాలను చదివారు ఫారడే, వాటిల్లో 'ది ఇంప్రూవ్మెంట్ ఆఫ్ ది మైండ్' వంటివి కూడా ఉన్నాయి. ఆ కాలంలో దగ్గరలో ఫిలసాఫికల్ సొసైటీలో జరిగే ఉపన్యాస కార్యక్రమాలకు ఫారడే తరచు వెళ్లేవాడు. మరీ ముఖ్యంగా జేన్ మార్సెట్ (Jane Marcet) రాసిన 'కాన్వర్జేషన్స్ ఆన్ కెమిస్ట్రీ' అనే పుస్తకం చదివి, విద్యుచ్ఛక్తికి సంబంధించి చాలా ఆసక్తిని పెంచుకున్నారు.

1812లో అంటే ఫారడే తన 20 ఏళ్ల వయసులో హంఫ్రీ డేవి (Humphry Davy), జాన్ టాటమ్ (John Tatum) అనే శాస్త్రవేత్తలు అద్భుతమైన ప్రసంగాలు చేశారు. ఈ ప్రసంగాలను విని మైఖేల్ ఫారడే, నోట్స్ రాసుకుని, వాటి ఆధారంగా సుమారు 300 పేజీల పుస్తకాన్ని రాసి హంఫ్రీడేవికి పంపారు. 1813లో నైట్రోజన్ ట్రైక్లోరైడ్ సంబంధించిన ప్రయోగాలు చేస్తూ హంఫ్రీ డేవీ దురదృష్టవశాత్తు చూపును కోల్పోయారు. దాదాపు అదే సమయంలో ఫారడే తయారు చేసిన పుస్తకం చదివిన విషయం గుర్తుకు వచ్చి హంఫ్రీ డేవీ, రాయల్ ఇన్‌స్టిట్యూషన్‌లో సహాయకుడిగా చేరమన్నారు. దానితో పుస్తకాల షాపులో చేసే పనిని ఫారడే వదిలేసి విజ్ఞాన పరిశోధన రంగంలోకి ప్రవేశించారు. హంఫ్రీ డేవీ చేస్తున్న నైట్రోజన్ ట్రై క్లోరైడ్ ప్రయోగాలను ఫారడే కొనసాగించారు, ఫలితంగా ఒక సందర్భంలో గురు శిష్యులు ఇద్దరు గాయపడ్డారు.

అయితే ఫారడే విజయవంతంగా ఎన్నో ప్రయోగాలు చేస్తూ పోయారు. కనుకనే విజ్ఞాన శాస్త్ర సంబంధమైన కృషికి గుర్తింపుగా 1832లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ గౌరవ పురస్కారంగా డాక్టరేట్ డిగ్రీ ఇచ్చింది. అలాగే అక్కడ లభించే నైట్ హుడ్ గౌరవాన్ని ప్రకటించినా, దైవ నిర్ణయానికి వ్యతిరేకంగా సంపదను, కీర్తిని పొందడం సరికాదనే కారణంతో ఫారడే దానిని తిరస్కరించారు. 75 ఏళ్ల వయసులో 1867 ఆగస్టు 25న మైఖేల్ ఫారడే చనిపోయారు. దానికి కొంత కాలం క్రితమే, ప్రముఖుల స్మశానంలో కాకుండా, మహాశాస్త్రవేత్త ఐజాక్ న్యూటన్ సమాధి చెంత తన సమాధి ఉండాలని ఫారడే కోరుకున్నారు. యూనివర్సిటీ డిగ్రీలు, చాలా సౌకర్యాలు ఉంటే కానీ పరిశోధనలు సాగవు... అనే అభిప్రాయాన్ని వమ్ము చేసేది ఫారడే జీవితం. అయితే ఎటువంటి పనిచేసినా మనకు సహజ సిద్ధమైన ఆసక్తి, జిజ్ఞాస, కృషి, పట్టుదల సమాజానికి ఉపయోగపడే దృష్టి ఉన్నప్పుడు అద్భుతమైన ఫలితాలు వస్తాయని ఆయన తన జీవన విధానం ద్వారా మనకు రుజువు చేశారు. కనుకనే నీల్స్ బోర్ వంటి శాస్త్రవేత్త మైఖేల్ ఫారడే జీవితమే ఎంతో స్ఫూర్తివంతం అని ప్రకటించారు.

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732 392



# విలువల బడి - సృజనకు గుడి

సమ్మర్ క్యాంప్ ముగింపు మురిసేలా... 18 రోజులు బహు వైవిధ్య భరితం... చిరుతలు చిందులతో అదర గొట్టారు... బుడిబుడి అడుగులు వేసే చిట్టి పాపలు నెమళ్లై నాట్యం చేస్తే... గణితాన్ని సులభంగా చెప్పేస్తే...పేపర్ క్రాఫ్టింగ్ చేసి అందంగా ప్రముఖులకు బహుమతులు అందిస్తే.. అనగనగా ఒక కథ చెబుతా వింటారా...? అంటూ కథలు చెబితే... తెలుగు భాష ఔన్నత్యం పై పాటలు పాడితే.. సైన్సులో సరదాలు విప్పి చెప్పితే... ఆ పిల్లలే కవితలు కైకడితే.. ఎట్లుంటుందో మనం గనుక చూస్తే.. పిల్లల ప్రపంచమే న్యాయమైన ప్రపంచంగా ప్రతి ఒక్కరికి అనిపిస్తుంది సుమా.... అలా సాగింది ... తెలంగాణ బాలోత్సవం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. హ్యాపీ, హ్యాపీ సమ్మర్ క్యాంప్ సందడిగా ... సరదాగా హంగామాగా ముగిసింది.


విలువల బడిగా సృజనకు గుడిగా సమ్మర్ క్యాంపు 18 రోజులు 32 మంది బాలసాహితీ వేత్తలు, సినీ గేయ రచయితలు, పిల్లల నిపుణులు విజ్ఞానదాయకంగా దేశ భక్తియుతంగా సందేశాత్మకమైన ఉపదేశాలు మారుతున్న పరిస్థితులు భవిష్యత్తులో తీసుకోవలసిన జాగ్రత్తలు బోధించారు. ఆట పాటలు పిల్లల ప్రతిభ పాటవాలు ప్రదర్శిస్తే చూసి తల్లిదండ్రులు మంత్రముగ్ధులయ్యారు. స్కిట్‌ను చూసి కన్నీళ్ల పర్యంతమైనారు. చివరికి చక్కటి సందేశంతో ముగుస్తుంది. ఆడపిల్లలు కన్నీళ్లు కాదు, కన్నెర్ర చేయాలి. ఏడుపు కాదు ఎదురు తిరగడం నేర్పింది. పేద పిల్లల పేగు బంధం బాలోత్సవం సమ్మర్ క్యాంప్‌గా సాగింది. బాలలలో శాస్త్రీయ ఆలోచన సృజనాత్మకతను నేర్పింది సంస్కృతి కళలను నేర్పించి ఆడించింది క్రీడలను, ఇండోర్ గేమ్స్‌ను ప్రోత్సహించింది.


పిల్లల కోరిక మేరకు. శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్ & కల్చర్ గ్రామీణ వాతావరణాన్ని చూపించాలి 89 మంది పిల్లలకు 2 బస్సులు కావాలని ఇందుకు సహకరించమని తెలంగాణ బాలోత్సవం చిరు ఉత్తరానికి స్పందించిన ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ డైరెక్టర్ గారి సహాయ సహకారాలతో గ్రామీణ చేతి వృత్తులు ప్రకృతి పర్యావరణం పట్ల సమగ్రమైన అవగాహనను కల్పించడం జరిగింది పిల్లలు బాగా ఎంజాయ్ చేశారు. శారీరక మానసిక ఆరోగ్యం పై అవగాహనను కల్పించారు. దేశభక్తిని పెంపొందించి సమాజంలో వారి పాత్రలను తెలియజేశారు. శ్రమ పట్ల గౌరవం, సమిష్టి తత్వాన్ని సోదరత్వాన్ని ప్రేమతత్వాన్ని పిల్లల్లో నేర్పించాము. సైన్సు మూఢనమ్మకాలపై అవగాహన, ఇతరులకు సహాయపడటం లాంటి పిల్లల మధ్య సంబంధాన్ని స్నేహ భావాన్ని పెంచగలిగారు. ఈ పిల్లలంతా సుందరయ్య విజ్ఞాన కేంద్రం పరిధిలో ఉన్న కాచిగూడ, నారాయణగూడ బాగ్‌లింగంపల్లి, నల్లకుంట చిక్కడపల్లి, రాంనగర్ పాలమూరు బస్తీ, అంబర్‌పేట శంకర్ మఠ్ కొందరు ఉప్పల్ ప్రాంత నిరుపేద పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది పిల్లలగా వచ్చి పిడుగులుగా ఇంటికి చేరారని తల్లిదండ్రులు అభినందించారు. ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. ఈ సమ్మర్ క్యాంపులో 89 మంది 18 రోజులపాటు పాల్గొన్నారు. సాహసగాథలు మహనీయుల చరిత్ర లను మరవోద్దుంటూ పాడిన పాటలు చెవులుంటే..? సరి అవి వింటే..? పిల్లలలోనూ ఇంత మంచి కళాకారులు ఉంటారా..? అని నిరూపించారు సమ్మర్ క్యాంప్ పిల్లలు ఆట పాటలు తల్లిదండ్రులతో కలిసి విన్నారు, కల్సిపాడారు కల్సి భోజనము చేసి రెట్టింపు ఉత్సాహంతో తిరిగి 2026 సమ్మర్ క్యాంప్‌కు స్వాగతం పలుకుతూ ముగిసినది.

– భూపతి వెంకటేశ్వర్లు
తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు
m : 9490098343


నాకు గ్లాసుడు నీళ్ళు పోసావు! అందుకు ప్రతిఫలంగా ఇది తీసుకో!!
వడ్డేపల్లి వెంకటేష్



వాననీటిని ఒడిసిపడదాం భూగర్భజలాలను పెంచుకుందాం!
భూమి
వడ్డేపల్లి వెంకటేష్


సుజలాం సుఫలాం అన్నవాళ్ళకు మేం చేస్తాం సలామ్!
వడ్డేపల్లి వెంకటేష్


చిన్నారులూ.. మీ పెద్దాళ్ళలా కాకుండా నన్ను జాగ్రత్తగా చూసుకుంటారు కదూ! నన్ను వృథా చేయరు కదూ!!
వడ్డేపల్లి వెంకటేష్


వడ్డేపల్లి వెంకటేష్


నైరుతి రుతుపవనాలు.. కేరళ తీరాన్ని ఎలా తాకుతాయో చూడ్డానికి వెళ్ళాట్ట! అవి వీడిని తాకినట్టున్నాయి!
వడ్డేపల్లి వెంకటేష్




# అర్జున్ ఎరిగైసి

## ఈస్పోర్ట్స్ వరల్డ్ కప్‌కి అర్హత పొందిన తొలి భారతీయ చెస్ గ్రాండ్ మాస్టర్

రియాద్ (సౌదీ అరేబియా): 2025లో జరగబోయే ఈస్పోర్ట్స్ వరల్డ్ కప్ (EWC)కు అర్హత సాధించిన తొలి భారతీయ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా అర్జున్ ఎరిగైసి చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. అర్జున్, చెస్‌డాట్‌కామ్ క్లాసిక్ టోర్నీలో 7/9 పాయింట్లతో ప్లే-ఇన్ స్విస్ దశను ముగించి నాలుగో స్థానాన్ని ఆక్రమించాడు. ఆ తర్వాత, డేనియల్ దుబోవ్‌పై విజయం సాధించి ప్లేఆఫ్స్‌కు చేరుకున్నాడు. దీంతో అతను చాంపియన్స్ చెస్ టూర్ (CCT) టాప్-12లో స్థానం దక్కించుకుని, EWC 2025 టోర్నమెంట్‌కు అర్హత పొందాడు. ఇక భారత ఆటగాళ్ల పరంగా చూస్తే, ప్రజ్ఞానానంద మొదటి రౌండ్ ప్లేఆఫ్‌లో డింగ్ లిరెన్ చేతిలో ఓడిపోయాడు. ప్రపంచ ఛాంపియన్ డి. గుకేష్ వ్లాదిమిర్ ఫెడోసీవ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఈ టోర్నమెంట్‌కు అర్జున్‌తో పాటు మాగ్నస్ కార్ల్సెన్, హికారు నకమురా, ఇయాన్ నెపోమ్నియాచి, జాన్ క్రిస్టోఫ్ డుడా లాంటి ప్రపంచ దిగ్గజాలు కూడా అర్హత పొందారు. భారత తరఫున ఇప్పటివరకు అర్జున్ ఎరిగైసి మాత్రమే ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌లోకి అడుగుపెట్టడం గర్వకారణం.




# ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ కప్ విజేతగా కనక్

## మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణం

న్యూఢిల్లీ: భారత యువ షూటర్ కనక్ ప్రపంచ స్థాయిలో తన ప్రతిభను చాటింది. హరియాణాకు చెందిన 17 ఏళ్ల కనక్, ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచకప్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది.

ఫైనల్ పోటీలో ఎనిమిది మంది అగ్రశ్రేణి షూటర్లు తలపడ్డ పరిస్థితుల్లో కనక్ 239 పాయింట్లు స్కోర్ చేసి మొదటి స్థానాన్ని దక్కించుకుంది. మాల్డోవాకు చెందిన అనా దుల్చే 237.3 పాయింట్లతో రజతం, చైనీస్ తైపీకి చెందిన చెన్మెన్ కాంస్యం గెలుచుకున్నారు. ఈ విజయం భారత యువ షూటింగ్ సత్తాకు నిదర్శనం. కనక్ భవిష్యత్తులో సీనియర్ స్థాయిలో కూడా గొప్ప విజయాలు సాధించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

– బాలచెలిమి డెస్క్

మ్యాథ్స్ ట్రిక్స్

# వరుస 10 సంఖ్యల మొత్తం



1. ఏ సంఖ్య నుండైనా మొదలు పెట్టి అక్కడి నుండి 10 సంఖ్యలు వరుసగా కూడుకోమని చెప్పాలి.
2. కూడిక పూర్తి అయిన తర్వాత ఎక్కడి నుండి ఎక్కడి వరకు కూడారో అడగాలి.
3. అది విని వెంటనే వారి జవాబును చెప్పాలి.

ఉదా:

15+16+17+18+19+20+21+22+23+24 = 195

68+69+70+71+72+73+74+75+76+77 = 725

97+98+99+100+101+102+103+104+105+106 = 1015

15 నుండి 24 వరకు అనగానే 195 అని

68 నుండి 77 వరకు అనగానే 725 అని

97 నుండి 106 వరకు అనగానే 1015 అని చెప్పాలి.

రహస్యం: మొదటి సంఖ్యకు 4 కలపాలి

ఆ సంఖ్య ప్రక్కన 5 చేర్చాలి

15 + 4 = 19 ➜ 195

68 + 4 = 72 ➜ 725

97 + 4 = 101 ➜ 1015

## BEAUTY NUMBER

**1 2 3 4 5 6 7 9 X 9 multiplies**

**1 2 3 4 5 6 7 9 x 9 = 1 1 1 1 1 1 1 1 1**

**1 2 3 4 5 6 7 9 x 18 = 2 2 2 2 2 2 2 2 2**

**1 2 3 4 5 6 7 9 x 27 = 3 3 3 3 3 3 3 3 3**

**1 2 3 4 5 6 7 9 x 36 = 4 4 4 4 4 4 4 4 4**

**1 2 3 4 5 6 7 9 x 45 = 5 5 5 5 5 5 5 5 5**

**1 2 3 4 5 6 7 9 x 54 = 6 6 6 6 6 6 6 6 6**

**1 2 3 4 5 6 7 9 x 63 = 7 7 7 7 7 7 7 7 7**

**1 2 3 4 5 6 7 9 x 72 = 8 8 8 8 8 8 8 8 8**

**1 2 3 4 5 6 7 9 x 81 = 9 9 9 9 9 9 9 9 9**

– అంకెల మామయ్య చంద్రయ్య
m: 9440926937

కథ

# కప్ప చెప్పింది... తప్పు తెలిసింది!


సాకేత్ నాలుగో తరగతి పూర్తి చేశాడు. వేసవి సెలవులు కావడంతో, కోనసీమ జిల్లాలోని, తన అమ్మమ్మ ఊరైన మానేపల్లి వెళ్ళాడు. ఉదయమే, స్నేహితులతో ఆడుకోవడం, ఆపై అక్కడే చెరువు వద్ద ఉన్న బల్ల మీద కూర్చోని, చెరువులోకి రాళ్లు విసరడం వాడికి ఆటవిడుపుగా మారింది. అలవాటులో భాగంగానే, స్నేహితులతో ఆడుకున్న తర్వాత, ఒక్కడే చెరువు వద్ద బల్ల మీద కూర్చున్నాడు. అప్పుడే ఒక పెద్ద కప్ప గట్టు మీద నుండి చెరువులోకి వెడుతుండడం గమనించాడు. సరదాగా అనిపించి వెంటనే ఒక రాయి విసిరాడు. కానీ అది కప్ప పక్క నుండి, చెరువులో పడటంతో, మరొక రాయి విసిరాడు. కప్పకు తగిలింది. వెనక్కు తిరిగింది. సాకేత్ కేసి బాధగా చూసింది.

"నన్ను రాయితో కొట్టడం నీకు తప్పుగా అనిపించ లేదా?" బాధపడుతూనే, సాకేత్‌ను అడిగింది. "అల్పజీవులను కొట్టడం, నా అల్లరిలో ఒక భాగం. అయినా, 'బెక బెక' మంటూ అరుస్తావ్. పర్యావరణానికి నీ బెకబెక చప్పుడు వలన చేటు. అందుకే కొట్టాన"న్నాడు గొప్పగా సమర్థించుకుంటూ.

"పర్యావరణం పచ్చగా ఉండటానికి నేనూ ఒక కారణమని తెలుసుకో" అంది కప్ప, కొంచెం కోపంగా. "నువ్వు చేసే గొప్ప పనులేమిటో?" వెక్కిరిస్తూ, కప్పతో అన్నాడు.

"నువ్వు మా గురించి చదవలేదా? నా చర్మం విష పదార్థాలను పీల్చుతుంది. తద్వారా, గాలి నాణ్యత పెరుగుతుంది. నీటికి పట్టిన నాచును తింటూ, నీటిని శుభ్రం చేస్తాను. నీటి మీద, నేల మీదా కూడా జీవిస్తూ, రైతులకు మేలు చేస్తాను. ఇప్పుడు కూడా, నువ్వు కూర్చున్న చోట, విషపు కీటకాలుంటే, వాటిని చంపి తిని, చెరువులోకి వెడుతున్నాను. కప్పలను కాపాడితేనే పర్యావరణం, 'పచ్చదనం'. లేకుంటే 'నాశనం'. నాలాంటి మేలు చేసే జీవులను మనిషిగా కాపాడు. "ప్రకృతి సమతుల్యమవుతుంది చూడు. నన్ను రాయితో కొట్టినందుకు కాదు. మరే జీవిని, నువ్వు హింసించకూడదనుకున్నాను. కప్పగా చెప్పవలసినది చెప్పాను. ఆపై నీ ఇష్టం. నువ్వు బుద్ధి మార్చుకోకపోతే మీకే కష్టం!" అంటూ కప్ప చెరువులోకి వెళ్ళి పోయింది. "లేదు, ఏ అల్ప జీవినీ హింసించను. పర్యావరణ పచ్చదనానికి కప్పలు కూడా కారణమని గమనించాను". 'హింసించను, హింసించను' అని గట్టిగా అన్నాడు. "సాకేత్! ఏమిటా కలవరింతలు?" అమ్మ నిద్ర లేపుతూ అడిగింది. సాకేత్ కళ్ళు తెరిచి చూసాడు. కల అని అర్థమైంది. 'నిన్న సాయంత్రం చెరువు వద్ద ఆడుకుంటూ కప్ప పై రాయి విసిరాడన్న విషయం గుర్తు కొచ్చింది. ఇంకెప్పుడూ, పర్యావరణానికి మేలు చేస్తున్న కప్ప లాంటి ఇతర జీవులను బాధ పెట్ట కూడదనుకున్నాడు.

– కె.వి.లక్ష్మణ రావు
టీచర్, మానేపల్లి, పి.గన్నవరం మండలం,
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్.
m : 9014649041



# మోసపోయిన బ్రాహ్మణుడి కథ



ఒక ఊరిలో ఒక బ్రాహ్మణుడు ఉన్నాడు. ఒకసారి ఆ బ్రాహ్మణుడు యజ్ఞం చేయాలని అనుకున్నాడు. ఎవరినో యాచించి ఒక మేకను సంపాదించాడు. ఆ మేక మెడకు తాడు కట్టి తన ఊరికి ప్రయాణం మొదలు పెట్టాడు. ఆ మేక అతడితో నడవకుండా మొరాయించింది. గతిలేక అతడు దానిని భుజాలపై ఎక్కించుకుని నడవడం మొదలు పెట్టాడు.

ఇది ముగ్గురు దొంగలు చూశారు. మోసంతో ఆ మేకను సంపాదించాలని అనుకొన్నారు. ఒక పథకం పన్ని ముగ్గురూ విడిపోయారు.


వారిలో మొదటివాడు బ్రాహ్మణుడికి ఎదురువెళ్ళి. "అయ్యా! మీరు ఎంతో పవిత్రంగా ఉండాలి కదా, మరి ఆ కుక్కను ఎందుకు మోస్తున్నారు?" అని అడిగాడు. ఆ మాటకు బ్రాహ్మణుడు కోపంతో, "నీకు కళ్ళు లేవా? దీన్ని కుక్క అంటావేమిటి?" అని గద్దించాడు. అప్పుడు ఆ మొదటి దొంగ, "అయ్యా! కోపం తెచ్చుకోవద్దు? మీకు ఇష్టంగా ఉంటే ఆ కుక్కనే మోసుకుని వెళ్ళండి! అయినా నాకెందుకు?" అంటూ తన దారిన తాను వెళ్ళిపోయాడు.

బ్రాహ్మణుడు ఇంకొంత దూరం నడిచాక, రెండవ దొంగ ఎదురుగా వచ్చి, "కుక్కని మోసుకుపోతున్నారు ఎందుకు?" అని ప్రశ్నించాడు. వాణ్ణి కూడా ఆ బ్రాహ్మణుడు విదిలించి వేశాడు.



ఇంకా కొంతదూరం వెళ్ళిన తరువాత మూడవ దొంగ వచ్చి మొదటి ఇద్దరూ అన్న మాటలనే తానూ అని, ఆ బ్రాహ్మణున్ని వెక్కిరించాడు.

ఇలా వరుసగా తాను మోసేది, "మేక కాదు, కుక్క!" అంట ముగ్గురు ఎదురుపడేసరికి ఆ బ్రాహ్మణుడికి అనుమానం కలిగింది. తనకు మేకలాగానే కనిపిస్తున్నా బయటి వారికి అది కుక్కలాగా కనబడుతోంది కాబట్టి అదేదో భూతం అనుకుని, ఆ మేకను క్రింద పారేసి భయంతో పారిపోయాడు. ఆ ముగ్గురు దొంగలు ఆ మేకను తీసుకుని నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.



**నీతి : నలుగురు ఒకేమాట చెప్పినంత మాత్రాన ఏ విషయాన్నీ త్వరపడి నమ్మకూడదు. మన వివేకాన్ని బుద్ధిని ఉపయోగించి నిజాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.**

సేకరణ : అమరావతి

కథ



# గుర్రపు స్వారీ

## డుకెన్‌బొయ్ డొజ్‌హనొవ్

అనగనగా ఒక ఊరిలో ‘దలబి’ అనే పిల్లవాడు ఉండేవాడు. వాళ్ళ నాన్న పందెం గుర్రాలు స్వారీ చెయ్యడంలో బాగా పేరు గడించాడు. అతను, కొడుకుకి కూడా గుర్రపు స్వారీ నేర్పించాడు.

ఆరేళ్ళ వయసు నుండీ గుర్రపు స్వారీ పోటీల్లో పాల్గొనేవాడు దలబి. ఎన్నో బహుమతులు సాధించాడు. వాళ్ళ ఊరికి పేరు తెచ్చాడు. ప్రస్తుతం వాళ్ళకున్న పందెం గుర్రం పేరు ‘కెరికిక్.’

పిల్లవాడికి తెలిసిన గుర్రపు పందాలు రెండు రకాలు.

మొదటిది ‘గుండ్రటి పందెం’.

ఈ పందెం నిర్ణీత ప్రదేశంలో జరుగుతుంది. కొన్ని కిలోమీటర్ల గుండ్రటి వృత్తం మీద జరుగుతుంది. కాబట్టి గుర్రాల్ని, గుర్రపు రౌతులని, ప్రేక్షకులు ఆట మొత్తం చూడగలరు.

రెండవది ‘సరాసరి పందెం’.

దీనిలో పందెం గుర్రాలు ఒకే దిశలో ప్రయాణించాలి. పందెం ప్రారంభంలో జెండా వూపినపుడు ప్రేక్షకులు గుర్రాలను చూస్తారు. పందెం చివరిలో మొదట వచ్చిన, గెలిచిన గుర్రాన్ని ప్రేక్షకులు చూస్తారు. పందెం మధ్యలో జరిగేదాన్ని చూసే అవకాశం ప్రేక్షకులకు ఉండదు.

ఆ రోజు జరుగుతున్న రేసు ‘గుండ్రటి పందెం.’ ఒక విడత ఆరు కిలోమీటర్లు ప్రయాణించాలి. అలా ఆరు విడతలు ప్రయాణించిన మీదట ముప్పైయవ కిలో మీటరుకు ఏ పందెం గుర్రం చేరుకుంటుందో అది, దాన్ని స్వారీచేసిన గుర్రపు రౌతు విజేతలవుతారు.

జెండా వూపారు.

పందెం ప్రారంభమైంది.

మన పిల్లవాడి గుర్రాన్ని ముందురోజు రాత్రే వాళ్ళ నాన్న సిద్ధం చేశాడు. దానికి స్నానం చేయించి, మెత్తటి నూలు బట్టతో ఒళ్ళంతా తుడిచాడు. గుగ్గిళ్ళు, ఉలవలు తినిపించాడు. నీరు తాగించాడు. ప్రేమగా నిమిరాడు. అందమైన గట్టి కళ్ళాన్ని తగిలించాడు. జెండా ఊపగానే, దుమ్ము గాల్లోకి లేచింది.

గుర్రాలన్నీ ఒక్కసారిగా దౌడు తీశాయి. ఈ పందెంలో మొత్తం పది గుర్రాలు పాల్గొన్నాయి. మిగిలిన తొమ్మిదిని, ఇరవై అయిదు సంవత్సరాల వయసున్న గుర్రపురౌతులు స్వారీ చేస్తున్నారు. ఈ చిన్న పిల్లవాడి వయసు కేవలం పది సంవత్సరాలు. అయితేనేం మనవాడు ‘అద్భుతమైన గుర్రంరౌతు’. గుర్రం కూడా మేలుజాతి గుర్రం.

మొదటి విడతలో అందరికంటే పిల్లవాడు ఆధిక్యం సాధించాడు.

రెండవ విడతలో కూడా పిల్లవాడిదే ప్రథమ స్థానం.

కానీ మూడవ విడతలో గుర్రం కళ్ళెం కొంచెం ఊడింది.



పిల్లవాడు తన పళ్ళతో కళ్ళాన్ని పట్టుకొని, దాన్ని చేత్తో సరిచేశాడు. ఈ కొద్ది సమయంలో ప్రత్యర్థి నల్లగుర్రం వేగంగా దూసుకొని వెళ్ళి మూడవ విడతలో ఆధిక్యం సాధించింది.

నాలుగవ విడతలో మళ్లీ పిల్లవాడి గుర్రందే పైచేయి.

చివరిదైన ఐదవ విడత ప్రారంభమయింది.

ప్రత్యర్థి నల్ల గుర్రం కూడా పోటాపోటీగా పరిగెడుతోంది. కానీ మన చిన్న పిల్లవాడు, తన గుర్రాన్ని దౌడు తీయించాడు. అది వాయువేగంతో పరిగెత్తి ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రజలు జయజయ ధ్వానాలు చేశారు.

పిల్లవాడి నాన్న, పిల్లవాణ్ణి కౌగిలించుకుని, "మన వంశం పరువు నిలబెట్టావు" అన్నాడు. పిల్లవాడు ప్రేమగా తన తండ్రిని, గుర్రాన్నీ కౌగిలించుకున్నాడు.


స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**
m : 8179273974

ఇంగ్లీష్ టైటిల్ : ది లిటిల్ జాకీ
రైటర్ : దుకెనబాయ్ డొజ్‌హనోవ్
ఇంగ్లీష్ అనువాదం : జానెట్ బట్లర్

శతకం


# వేమన పద్యాలు

**తల్లిదండ్రిమీద దయలేని పుత్రుండు**
**పుట్టనేమివాఁడు గిట్టనేమి**
**పుట్టలోనఁ జెదలు పుట్టదా గిట్టదా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : పుట్టలో చెదలు పుడుతుంది, చస్తుంది. అదే విధంగా కనిపెంచిన తల్లిదండ్రుల మీద కనికరం లేని కొడుకు పుట్టి లాభం లేదు, చచ్చి నష్టం లేదు.

**కనకమృగము భువినికద్దు, లేదనలేక**
**తరుణి విడిచిపోయె దాశరథియు**
**దైవమైన ధనము తలచుచుండునుగాదె**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : భార్య కోరినదని మంచి చెడు విచారింపక మాయలేడి వెంట పరుగులిడిన రాముడు దేవుడెలాగయ్యాడు.








# రాక్షస గూళ్ల యుగం

క్రీ.పూ. 2500 సంవత్సరాల నుంచి, క్రీ.శ.300 సంవత్సరాల మధ్య ప్రజలు చనిపోయిన వారి అస్థి పంజరాలను మట్టి శవపేటికలో గాని, రాతి గూడులో గాని పెట్టి, పూడ్చి ఆ గూడు చుట్టూ పెద్ద పెద్ద రాళ్లను వలయాకారంలో నిలిపేవారు. కొన్ని చోట్ల గూడు నిర్మాణంలో వాడిన రాళ్లు కూడా భారీ పరిమాణంలో ఉన్నాయి. కాబట్టి, ఈ యుగాన్ని బృహత్ శిలా యుగం లేదా రాక్షసగూళ్ల యుగం లేదా పెద్ద రాతి యుగమని అంటారు. ఈ యుగంలో మొదటిసారిగా ఇనుప వస్తువులను విరివిగా వాడారు కాబట్టి, ఇనుప యుగమని పిలుస్తారు. స్థానిక ప్రజలు ఈ గూళ్లను పాండవుల గుళ్లు, వీర్లపాదులని కూడా పిలుస్తారు.

### ఎందుకు కట్టుకునేవారంటే...

మనిషి చనిపోయినా ఆత్మ జీవించి ఉంటుందని, అది గ్రామాల్లోకి వచ్చి ప్రజలకు హాని చేయకుండా సమాధి వరకే పరిమితమై ఉండటానికి, చనిపోయిన వ్యక్తి బతికున్నప్పుడు వాడిన పనిముట్లతో పాటు అతనికి ఇష్టమైన ఆహార పదార్థాలను కుండలో పెట్టి సమాధిలో నిక్షిప్తం చేసేవారు. చాలా సందర్భాల్లో చనిపోయిన వ్యక్తికి ప్రియమైన పెంపుడు జంతువులను కూడా అతనితోపాటు ఖననం చేసేవారు. ఇలాంటి రాక్షస గూళ్లు ప్రపంచమంతటా కనిపించినప్పటికీ ఐరోపా, ఆసియా ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. భారతదేశమంతటా ఈ రాక్షస గూళ్లు ఉన్నప్పటికీ దక్కన్లోనే ఎక్కువగా కనిపిస్తున్నాయి. తెలంగాణలో మరీ ఎక్కువ. గుట్టల పైనుండే సమతల ప్రదేశాల్లోనూ, లోయల్లోనూ, నీటి వనరుల దగ్గర ఎక్కువగా కనిపిస్తాయి. ఇప్పటి వరకు జరిగిన పరిశోధనల ప్రకారం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆవరణలో ఉన్న ఒక రాక్షస గూడు సమాధి ఈ యుగానికి సంబంధించి దేశంలోనే మొదటిదని తేలింది. దానిలో దొరికిన ఆహారపు గింజలు ఇప్పటికి 4,250 సంవత్సరాల కిందటివని శాస్త్రీయ పరీక్షలు నిర్ధారించాయి.

నారాయణపేట జిల్లాలోని ముడుమలలో సుమారు 80 మెన్హిర్లు, వాటి చుట్టు పక్కల సుమారు 3 వేల వరకు రాక్షసగూళ్ల రాళ్లు ఉండేవి... రెండు దశాబ్దాల క్రితం వరకు. ఈ మెన్హిర్ల సముదాయం దగ్గర ఉన్న అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఒక రాయిపై సప్తర్షి మండలాన్ని అరుంధతి నక్షత్రంతో సహా బద్దుల రూపంలో (Cup Marks) చెక్కారు. దీన్ని గుర్తించిన కె.పి. రావు ప్రపంచంలోనే అరుదైన ఈ సప్తర్షి మండలం ఆధారంగా ఆ నాటి రైతులు, విజ్ఞులు ఉత్తర ధృవ నక్షత్రాన్ని, ఇతర నక్షత్రాల గమనాలను, రుతువుల ఆగమన, నిర్గమనాలను గుర్తించే వారు అన్నారు. చుట్టు పక్కల మురారిదొడ్డి వంటి చరిత్ర పూర్వయుగ స్థలాలు ఉన్నాయి. ఆ పక్కనే భీమా నదీ లోయలో కూడా చరిత్ర పూర్వయుగ స్థలాలు ఉన్నాయని డి.డి. కోశాంబి (Myth and Reality లో) ప్రస్తావించారు. ఇలాంటి స్థలాల ప్రజలు ముడుమలలోని సప్తర్షి మండలం పరిజ్ఞానాన్ని వినియోగించుకునే వారని చెప్పవచ్చు.

మానవాకార శిలలు, శిలువ ఆకార శిలలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మంగపేట, కాంచనపల్లి, గుండాల, జానంపేట, ములుగు జిల్లాలోని మంగపేట, మొదలైన గోదావరి లోయ ప్రాంతాల్లో మాత్రమే గృహ సమాధుల (Dolmenoid cist burials) దగ్గర కనిపించాయి. శిలువ రాళ్లు ఇక్కడ తప్ప ఇప్పటి వరకు ప్రపంచంలో మరెక్కడా కనిపించలేదు. ఈజిప్ట్ లోని పిరమిడ్ రాళ్లపై శిలువలను పట్టుకొన్న దేవతలను చిత్రించారు. కాబట్టి, ఆ మధ్యధరా ప్రాంతంతో తెలంగాణకు సంబంధం ఉన్నట్లు చరిత్రకారులు విశ్లేషిస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉప్పలపాడు

గుంత సమాధిలో పడవ ఆకారపు శవపేటిక ఆధారాలు లభ్యం కాగా, చిన్నమరూర్ గూడు సమాధిపై తడిక గుర్తులు కనిపించాయి. గోదావరి తీరంలో ఉన్న పోచంపాడు (నిజామాబాద్ జిల్లా), కాంచనపల్లి మొదలైన చోట్ల దీర్ఘచతురస్రాకార వేదికలు కనిపించాయి. అవి శవాన్ని రాబందులు వంటి పక్షులకు ఆహారంగా వేసే వేదికలు గాని, పనిముట్లు తయారు చేసుకొనే అరుగులు గాని అయ్యుంటాయని భావిస్తున్నారు.

### సాంస్కృతిక ప్రాధాన్యత:

రాష్ట్రంలో ప్రతి మండలంలోనూ రాక్షస గూళ్లు ఉన్నాయి. పురావస్తు శాఖ వారు మాత్రం సుమారు యాభై సమాధులను తవ్వారు. వాటిల్లో బయల్పడిన వస్తువులు ఆ యుగపు మనుషుల సాంస్కృతిక విశేషాలను తెలియచేస్తున్నాయి. అంత్య క్రియలకై వాడిన పలురకాల పాత్రలు, కుండలు, వాటి మూతలు, గుండ్రటి మూకుళ్లు, ముక్కాలు పీటలు మొదలైనవి ఎన్నో లభ్యమయ్యాయి. వాటిపై గోరు నొక్కులు, వేలి ముద్రలు, తాడుతో ఒత్తిన డిజైన్లు, రేఖా చిత్రాలు, కుమ్మరి చిహ్నాలు (Graffiti marks) కనిపించాయి.

జోగులాంబ గద్వాల జిల్లాలోని చిన్నమరూరులో కుండపై తెలుపు రంగు పూత కనపడింది. మునుపటి ఖమ్మం జిల్లాలోని రుద్రమకోటలో గుండ్రటి మట్టి కుండలకు కింద నాలుగు కాళ్లున్నాయి. అంటే, మట్టి పాత్రల తయారీలో ఈ యుగపు మానవులు చాలా ప్రగతి సాధించారని చెప్పవచ్చు. ఎరుపు-నలుపు రంగు పాత్రలు, పూర్తి నలుపు రంగుతో మెరిసే పాత్రలు ఈ యుగంలో ప్రత్యేకతను సంతరించుకొన్నాయి. ఇవి ఎక్కువగా సమాధుల్లో వాడే పాత్రలుగా గుర్తించబడ్డాయి. అయితే వీటిని ఒండ్రు మట్టితో కుమ్మరి సారె (చక్రం) మీదనే తయారు చేశారు. నలుపు-ఎరుపు రంగులు ఒకే పాత్రకు ఒక్కోవైపుకు కనిపించడానికి కారణం, అలాంటి పాత్రలను ఒకదానిపై ఒకటి బోర్లించి కాల్చడం. దానివల్ల కాలని పై భాగం నలుపుగా, కాలిన కింది భాగం ఎరుపుగా కనిపిస్తాయి. నునుపు లేని ముతక పాత్రల్లో చెప్పుకోదగినవి పెద్ద పెద్ద కుండలు, బానలు, శవ పేటికలు.

అలంకరణకు ఉపయోగించిన మట్టి పూసలు జోగులాంబ గద్వాల జిల్లాలోని వీరాపురంలో లభించాయి. హైదరాబాద్ దగ్గరున్న మౌలాలీలో మట్టి గాజులు బయటపడ్డాయి. మట్టి బొమ్మలు చాలా చోట్ల వెలుగులోకి వచ్చాయి. నిజామాబాదు జిల్లాలోని పోచంపాడులో కుక్కలు, జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉప్పేరులో కొమ్ములు తిరిగిన పొట్టేలు, శేరుపల్లిలో పొడవాటి కొమ్ముల దున్నపోతు, పెద్దపల్లి జిల్లాలోని పెద్దబొంకూరులో దున్నపోతు తల మొదలైన మట్టి బొమ్మలు లభించాయి. వీటిని ఆనాటి మానవులు తమ ప్రయోజనాల కోసం మచ్చిక చేసుకున్నారని తెలుస్తున్నది. దున్నపోతులను రవాణా, వ్యవసాయం అవసరాలకై వాడుకొని ఉంటారు. హైదరాబాద్ శివార్లలో ఉన్న హస్మత్ పేటలో నాగలి కర్రు వంటి వస్తువు దొరకడం ఇందుకొక నిదర్శనం.


ఇంచు మించు ప్రతి సమాధిలో ఇనుప వస్తువులు కనిపించాయి. వేట, యుద్ధాల్లో వాడిన చిన్న చిన్న కొడవళ్లు, గొడ్డళ్లు, బల్లెపు మొనలు, కత్తులు, ఖడ్గాలు, బల్లేలు, బ్లేడ్లు, బాడిసలు, ఉలులు, త్రిశూలాలు, గుర్రపు నాడాలు, ఏనుగును అదిలించే అంకుశాలు పలుచోట్ల దొరికాయి. వీటి వల్ల ఆనాటి మనుషులు గుర్రాలు, ఏనుగులను మచ్చిక చేసుకొని వాటిని రవాణా, వేట, యుద్ధాల్లో ఉపయోగించుకొన్నారని అర్థమౌతుంది. జోగులాంబ గద్వాల జిల్లాలోని చిన్నమరూరులో దొరికిన చేపలు పట్టే గాలాలు ఆనాటి మనుషుల ఆహార ప్రాధాన్యాన్ని తెలియచేస్తున్నాయి.

పలు రాక్షస గూళ్లలో, ప్రత్యేకించి కృష్ణానది ఒడ్డున జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్న వీరాపురంలోని సమాధుల్లో అనేక రకాల ఆహార ధాన్యాల ఆధారాలు లభించాయి. వాటిల్లో ముఖ్యమైనవి వరి, బార్లి, కొర్రలు వంటి తృణ ధాన్యాలు, ఉలవ, బఠాణీ, మినుము, కంది, చిక్కుడు వంటి పప్పు లేదా కాయ ధాన్యాలు, రేగుపండ్లు, ఉసిరికాయలు మొదలైనవి. ఇదే జిల్లా శేరుపల్లి, ఉట్నూరుల్లో వరి పౌష్టికాహార ధాన్యంగా వెలుగు చూసింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని సమాధిలో రాగులు బయటపడ్డాయి. రాగి కత్తులు, కత్తి పిడులు, గంటలు, గాజులు, ఉంగరాలు, సూదులు పలు సమాధుల్లో దొరికాయి. వెండి, బంగారు వస్తువులు కూడా దొరికాయి. కాని చాలా స్వల్పంగా మాత్రమే. పెద్దపల్లి జిల్లాలోని కదంబాపూరులో బంగారు పూసలు, చెవి పోగులు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాయగిరిలో వెండి, బంగారు పూసలు, చెవి పోగులు, ఖమ్మం జిల్లాలోని పోలిచెట్టి చెరువుగడ్డలో బంగారు ఉంగరం లభించాయి. జోగులాంబ గద్వాల జిల్లాలోని శేరుపల్లి, చిన్నమరూరు, పెద్దమరూరులలో లభించిన జాతి రాయి అగేట్ (agate), కురువిందం (carnelian), సూర్యకాంతమణి (jasper), కనిపించాయి. పోచంపాడు, చిన్నమరూరులలో కొమ్ముతో చేసిన దువ్వెనలు, ఖమ్మం పద్మరాగమణి (amethyst), స్ఫటిక రాళ్లు వివిధ ఆకారాల్లో ఆభరణాలుగా వాడబడినట్లు జిల్లాలోని నెల్లిమిల్లిలో దంతపు పూసలు, గాజులు, హస్మత్‌పేటలో ఎముకలతో చేసిన పూసలు లభించాయి.

-డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078

కథ

# పిసినారి



ఒక ఊరిలో కోటయ్య అనే కోటీశ్వరుడు ఉండేవాడు. అతడు పరమ పిసినారి. ఎంగిలి చేత్తో కాకిని గూడా బెదిరించడు. ఒంటి మీద నాసిరకం దుస్తులుంటాయి. అస్తమానం డబ్బులు సంపాదిస్తుంటాడు కాని ఖర్చు చెయ్యడు.

తాతల నాటి పూరింట్లో ఉంటూ ఒక గేదెను పెంచుకున్నాడు. గేదె రోజూ పాలు ఇస్తుంది. “గేదె కోసం నువ్వేమీ ఖర్చు చెయ్యరాదు. ఏదన్నా ఉంటే నేనే చూసుకుంటా”నని భార్యకు చెప్పాడు. వ్యాపారములో ఎలాంటి నష్టం రాకుండా జాగ్రత్త పడుతుంటాడు. దానధర్మాల జోలికి పోడు.

ఆ దారికి 20 కిలోమీటర్ల దూరములో పట్నం ఉంది. ఊరికి – పట్నానికి మధ్య అడవి ఉంది. వాహనాలు వెళ్లేందుకు రోడ్డు ఉంది. బస్సు సౌకర్యం గూడా ఉంది. అందునా బస్సు ఛార్జీలకు డబ్బు ఖర్చవుతందని పట్నానికి నడిచి వెళ్లేవాడు. ఊరి వారంతా అతన్ని “పిసినారి కోటయ్య” అని ఎద్దేవా చేసేవారు.

ఒకరోజు పట్నం వెళ్లాల్సి వచ్చింది. నడిచి వెళ్లాలి గదా! మధ్యలో ఆకలైతుందని ఓ చెంబు నిండా పాలు నింపాడు. ఆ చెంబును చేతికర్ర చివరకు తాడుతో కట్టాడు. కర్రను భుజమ్మీద ఉంచుకుని పట్నం బయలు దేరాడు.

అది ఎండాకాలం. అడవిలోంచి నడుస్తున్నాడు అడవిలో వేడి చాలా ఉంది. సగం దూరం నడవగానే అలసట ఆవహించింది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని ఆ తర్వాత వెళ్లాలనుకున్నాడు. రోడ్డు పక్కనున్న చెట్టు నీడలోకి వెళ్లాడు. పాలచెంబు కర్రను నేల మీదుంచి పక్కనే తాను ఒరిగాడు. పాల చెంబు పక్కన పాము పుట్ట ఉన్న సంగతి కోటయ్యకు తెలియదు.

వాతావరణం వేడిగా ఉంది. చెట్టునీడ చల్లగా ఉంది. నేల మీద పడుకోగానే చల్లగాలి ఒంటికి హాయిగా తాకింది. అనుకోకుండా నిద్రలోకి జారుకున్నాడు.

నిద్రలో అటూ – ఇటూ కదులుతూంటే చెయ్యి పాల చెంబుకు తాకింది. చెంబు పుట్టమీద బోర్లా పడింది. పాలు పుట్టలో పడ్డాయి. పుట్టలో నున్న నాగదేవత ఆ పాలను తృప్తిగా సేవించింది. ఇంత ఎండాకాలములో తన కోసం ప్రత్యేకంగా పాలు తెచ్చి పోసిన పుణ్యాత్ములెవరో తెలుసుకోవాలని నాగ దేవత పైకి వచ్చింది. పడగ విప్పి బుసకొట్టింది. దాంతో కోటయ్యకు మెలకువ వచ్చింది. లేచి కూచున్నాడు. పామును చూసి భయపడి దండం బెట్టాడు. ఖాళీ పాల చెంబు చూసి బాధపడ్డాడు.

నాగ దేవత పడగను తిప్పుతూ “భయపడకు మిత్రమా! ఇప్పుడే నాకు పాలు బోసి ఆకలి తీర్చావు. కాబట్టి నేను నీకేదన్నా సహాయం చేయదలుచుకున్నాను. నీకేమి కావాలో ఇప్పుడే కోరుకో!” అంది.

అసలు సంగతి కోటయ్యకు అర్థమైంది. ఊరి వారంతా

తనను పిసినారి అని వెక్కిరించడం గుర్తుకొచ్చింది. "నాగదేవతా! నన్ను అందరూ పిసినారి అని దెప్పి పొడుస్తున్నారు. అది నేను భరించలేకపోతున్నాను. నేను చక్కగా సంపాదించింది నేను అనుభవిస్తూ ఇరుగు పొరుగుకు సహకరించేలా వరమివ్వ"మని వేడుకున్నాడు.

"సరే! ఆ వరమిస్తున్నాను. ఇక నువ్వు వెళ్లు" అంది నాగదేవత.

వరమందుకున్న కోటయ్య బయటికొచ్చి తనను తాను చూసుకున్నాడు. తన దుస్తుల్ని చూస్తుంటే తనకే అసహ్యమనిపించింది. వెంటనే బస్సులో పట్నం వెళ్లి, కొత్త దుస్తులు కొనుక్కుని వేసుకున్నాడు. తిరిగి బస్సులో ఇంటికి తిరిగి వచ్చాడు. భార్యా పిల్లలు అతన్ని చూసి ఆశ్చర్యపోయారు. వాళ్లకి విషయమంతా చెప్పాడు. అంతే కాదు... భార్య, పిల్లలలకు గూడా కొత్త దుస్తులు కొన్నాడు. తన బంధుమిత్రులకు కావల్సిన సహాయము చేస్తూ తనుంటున్న పూరిల్లును కూడా కూలగొట్టి మిద్దె కట్టించాడు. అప్పటి నుండి హాయిగా ఉంటూ తోటి వారికి దానధర్మాలు చేయసాగాడు. పిల్లలూ! మనిషి తాను సంపాదించింది తాను అనుభవించడము గూడా ఒక వరమే సుమా!


– ఐతా చంద్రయ్య
m : 9391205299


# ప్రపంచ పర్యావరణ దినోత్సవం – 2025

**ప్రపంచ పర్యావరణ దినోత్సవం :** 1972 జూన్ 5 నుండి 16 వరకు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ స్టాక్ హోమ్‌లో "మానవ పర్యావరణం" అనే అంశం పై ఒక సదస్సును నిర్వహించింది. ఆ సదస్సులో పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం UNEP (ఐక్యరాజ్యసమితి పర్యావరణ ప్రణాళిక) అనే సంస్థను స్థాపించింది. ఈ సంస్థ సమన్వయంతో 1973 నుండి ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుంది.

**మొదటి ప్రపంచ పర్యావరణ దినోత్సవం:** 1973లో స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో మొదటి ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించడం జరిగింది. దీనికి నిర్దిష్టమైన ఇతివృత్తాంతంను ఇవ్వలేదు.

1974లో అమెరికాలో జరిగిన రెండవ ప్రపంచ పర్యావరణ దినోత్సవం, "ఓన్లీ వన్ ఎర్త్" అనే ఇతివృత్తాంతం (థీమ్) మీద నిర్వహించడం జరిగింది.

**ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025 :** 2025 జూన్ 5వ తేదీన నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి రిపబ్లిక్ అఫ్ కొరియా (దక్షిణ కొరియా) ముఖ్య ఆతిథ్య దేశంగా నిలిచింది. దక్షిణ కొరియాలోని జెజు అనే ప్రాంతంలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.

**ప్రధాన ఇతివృత్తాంతం (థీమ్) :** ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం.

**ప్లాస్టిక్ కాలుష్యం :** మనం ప్రతిరోజు వివిధ వస్తువులను కొనడానికి మరియు అనేక రకాల పనుల కోసం ప్లాస్టిక్‌ను వాడుతాం. ఈ ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి దాదాపుగా 100 సంవత్సరాలు పడుతుంది. కావున అతిగా ప్లాస్టిక్ వాడడం ద్వారా గాలి, నీరు, భూమి కలుషితమవుతున్నాయి. ప్రతి సంవత్సరం దాదాపుగా 11 మిల్లియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు జలావరణ వ్యవస్థలోకి చేరుతున్నాయి. దీని ద్వారా భూగర్భ జలాలు తగ్గి, త్రాగడానికి నీరు దొరకదు. అంతేకాకుండా మనం తాగే నీరు ప్లాస్టిక్ బాటిళ్లలో నిల్వ ఉంచడం ద్వారా మైక్రో ప్లాస్టిక్ రేణువులు నీటి ద్వారా మన శరీరంలోని కాలేయము, ఊపిరితిత్తులు, మెదడు, రక్తము, తల్లి పాలలో మరియు శుక్ర కణాలలో కూడా గుర్తించినట్లుగా కొన్ని అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి.

**ప్లాస్టిక్‌ని అరికట్టుదాం– పర్యావరణాన్ని పరిరక్షిద్దాం:**

- తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌ను వాడడంను నిషేధించాలి.
- "5 R" అను సూత్రాన్ని పాటించాలి (Reduce, Reuse, Re cycle, Re think, Refuse).
- ప్లాస్టిక్ సంబంధిత వ్యర్థ పదార్థాలను సమర్థవంతంగా నాశనం చేసి భూమిలో కలవకుండా చూడాలి.
- ప్లాస్టిక్‌కి బదులుగా ఇతర వస్తువులను వాడాలి (bags, steel glasses, spoons etc..)
- 2026లో జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి అజర్ బైజన్ ఆతిథ్య దేశంగా ఎంపిక చేయబడింది.


– జి. సత్యనారాయణ
పిజిటి – బోటని, టిజి మాడల్ స్కూల్,
జైనాథ్, ఆదిలాబాద్.
m : 9701686378





# అంతర్జాతీయ మ్యూజియం డే (మే 23, 2025)









హైదరాబాద్, మే 23, 2025 : అంతర్జాతీయ మ్యూజియం డే సందర్భంగా డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు, తెలంగాణ రాష్ట్ర హెరిటేజ్ శాఖ మరియు సివిల్ సొసైటీ గ్రూపుల సంయుక్త ఆధ్వర్యంలో గన్ ఫౌండ్రీలోని సెంటినరీ హెరిటేజ్ మ్యూజియంలో 'మ్యూజియం డే వాక్' కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టరు శ్రీమతి మాధవి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు చైర్మన్ మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ, సాలార్జంగ్ మ్యూజియం ప్రపంచ స్థాయిలో గొప్ప పురావస్తు ప్రదర్శన శాలలలో ఒకటిగా గుర్తింపు పొందిందని అన్నారు. ప్రజలందరూ మ్యూజియంల ప్రాముఖ్యతను తెలుసుకోవడం మరియు వాటిని తరచూ సందర్శించడం ఎంతో అవసరమన్నారు. చారిత్రక కట్టడాలు మరియు వాటి వెనుక ఉన్న నైపుణ్యం, సాంకేతికతను మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. బోధన్, కామారెడ్డి ప్రాంతాల్లో తాను చేసిన పర్యటనల ద్వారా స్థానిక చారిత్రక కట్టడాలపై సమాచారాన్ని సేకరించి, ఒక ప్రాజెక్టును రూపొందించినట్లు వెల్లడించారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఒక మ్యూజియాన్ని ఏర్పాటు చేసి, ఆ జిల్లా చరిత్రను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం నిధులను కేటాయించాలనీ విజ్ఞప్తి చేశారు. సాంకేతిక అభివృద్ధి ఎంత జరిగినా మన చరిత్ర, సంస్కృతిని మరువకూడదని ఆయన హితవు పలికారు. కుతుబ్షాహి మరియు ఆసఫ్ జాహీ కాలాల్లో మ్యూజియంలకు విశేష ప్రాముఖ్యత ఉన్నదని, సాలార్జంగ్ మ్యూజియం ప్రపంచ స్థాయిలో ఉన్న గొప్ప మ్యూజియం అని గుర్తు చేశారు.

తెలంగాణ ట్రైబల్ మ్యూజియం క్యూరేటర్ ద్యావనపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, మ్యూజియంలు ప్రజలకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని కూడా అందిస్తాయని అన్నారు.

ఈ ప్రదర్శనలో టెర్రకోట కుండలు, రాతి విగ్రహాలు, లోహపు వస్తువులు, పింగాణీ పాత్రలు, పురాతన ఫర్నిచర్ వంటి ఎన్నో చారిత్రక వస్తువులు ప్రదర్శించబడ్డాయి. రామప్ప, సంగమేశ్వర, త్రికుటాలయం, కపిలేశ్వర, ఈశ్వర స్వామి ఆలయాల నమూనాలు కూడా ప్రదర్శించ బడ్డాయి. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్కిటెక్చర్ కాలేజీలు మరియు ఆక్స్ఫర్డ్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించబడింది.

ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఆర్కియాలజీ బాజీ రావు, చరిత్రకారులు రత్నాకర్ రెడ్డి , సంగనభట్ల నర్సయ్య, స్థపతి శ్యాంసుందర్, అసిస్టెంట్ డైరెక్టర్లు మాధవి మరియు కె.రూపి, సూపరింటెండెంట్ రాజు, Lion ధనుంజయ, శోభాసింగ్, రామాంజుల, రమేశ్ గారు, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు కోఆర్డినేటర్ ప్రభాకర్, ఇన్చార్జ్ ఖైదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

– బాలచెలిమి డెస్క్



# నవ్వుల నదిలో సాగు

కాసంత చిరునవ్వులు
వదనానికి కడు అందం
పూసంత మన మనసులు
పెనువేయును ఘన బంధం

సదనవనంలో నవ్వులు
పరిమళించు సిరిమల్లెలు
సొగసులీనే పువ్వులు
తీయగా మ్రోగు మువ్వలు

జీవితాన మధుమాసం
తెచ్చిపెట్టు దరహాసం
ఎందుకోయి! ఆలస్యం
కావాలోయ్! ఆరంభం

పైసా ఖర్చు లేనిది
ఉచితంగా వచ్చునది
జాగేల ఇక నేస్తమా!
నవ్వుల నదిలో సాగుమా!

– గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు, కర్నూలు
m : 9966414580





## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

### చెలిమి క్లబ్

పేరు : ------------------
తండ్రి పేరు : ------------------
పుట్టినతేదీ : ------------------
చిరునామా : ------------------
------------------
------------------
పిన్ : ------------------
హాబీలు : ------------------
మొబైల్ : ------------------
ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com





# జ్యేష్ఠ మాసం

తెలుగు సంవత్సరంలో జ్యేష్ఠ మాసం మూడవ నెల. జ్యేష్ఠ నక్షత్ర కాంతి పరిధిలో సూర్యచంద్రుల సంచారాన్ని బట్టి ఈ నెలకు ఆ నక్షత్రం పేరు మీద 'జ్యేష్ఠ మాసం' అని పేరు వచ్చింది.

ఋతు ప్రవర్తనను బట్టి ఈ నెలకు ముందు నెలలు – చైత్ర, వైశాఖ మాసాలు రెండూ కూడా గ్రీష్మ ఋతువు అవుతాయి. ఈ నెలకు తరువాత వచ్చే నెల ఆషాఢం. దీనిని శూన్య మాసం అంటారు.

ఆషాఢం తర్వాత వచ్చే శ్రావణ, భాద్రపద మాసాలు రెండూ వర్ష ఋతువులు.

జ్యేష్ఠ మాసం మొదటి పక్షంలో రోహిణి కార్తె వెళ్లిపోతుంది. మృగశిర కార్తె ప్రవేశిస్తుంది. అంటే ఎండల ప్రతాపం తగ్గి వర్షాల ప్రారంభానికి సూచన అన్నమాట! అందుకే ఈ నెలలో వ్యవసాయానికి సంబంధించిన పనులు చాలా హడావుడిగా జరుగుతాయి.

వ్యవసాయం పనులు మొదలయినట్లే పాఠశాలలు కూడా తెరిచి కొత్త చదువులు ప్రారంభిస్తారు. అంతా పాత కొత్తల మేలు కలయికగా ఉంటుందీ నెల.

## జూన్

పాశ్చాత్యులు ఈ నెలను 'జూన్' అంటారు. ప్రాచీన కాలంలో ప్రఖ్యాతి గాంచిన 'జూనియస్' అనే రోమన్ కుటుంబం పేర ఈ నెలకు 'జూన్' అనే పేరు వచ్చిందని కొందరు అంటారు.

జూపిటర్ భార్య 'జూనో' అనే దేవత పేరున ఈ నెలకు 'జూన్' అనే పేరు వచ్చిందని మరికొందరు అంటారు. జూనో దేవత స్వర్గానికి రాణి. నెమళ్ళ చేత లాగబడే రథంలో ఆమె సంచారం చేసేది. కనుక 'జూనో' దేవత పేరున ఈ నెలకు 'జూన్' అని పేరు స్థిరపడడం నిజం అని నిర్ధారణ చేశారు.

ఈ నెలలో సూర్యకిరణాలు భూమికి నేరుగా పడతాయి. మన దేశంలో ఇది భయంకరమైన వేడిని ఇస్తుంది. అందుకే బయట తిరిగే పిల్లలకు ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. కనుకనే 'జూనో' 'శాప దేవత' అంటారు.


– **'బాల కథా సౌరభం' నుండి...**

సైన్సు

# పెరాక్సైడ్ రాకెట్

రాకెట్లలో ఉపయోగించే ఇంధనాలలో చాలా రకాలు ఉన్నాయి. దీపావళి తారాజువ్వలలో (అవీ రాకెట్లే) సూరేకారం, గంధకం, బొగ్గు నూరి కలిపిన మందు ఉపయోగిస్తారు. సూరేకారం అణువులలో దాగి ఉన్న ఆక్సిజన్ విడుదల అయి బొగ్గునూ, గంధకాన్నీ మండిస్తుంది. అప్పుడు కార్బన్‌డైఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ వాయువులు విస్తారంగా అతివేగంగా తయారువుతాయి. కిందనున్న సన్నని రంధ్రంలోనుంచి ఈ వాయువులు విసురుగా బయటికి వస్తూ ఉంటే ప్రతిక్రియ వల్ల వాటికి వ్యతిరేకదిశలో జువ్వపైకి లేస్తుంది. ఈ రకమైన ఘన పదార్థపు ఇంధనాలే కాక ద్రవరూపంలో ఉన్న ఇంధనాలు కూడా రాకెట్లలో ఉపయోగిస్తారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో "90 శాతం – హైడ్రోజన్ పెరాక్సైడ్" అనే ద్రవాన్ని ఉపయోగించి సుప్రసిద్ధమైన V-2 రాకెట్లు V-1 బజ్ బాంబులు, టార్పెడోలు మొదలైన మారణాయుధాలను జర్మనులు నడిపించ గలిగేరు.

2 హైడ్రోజన్ పరమాణువులు, ఒక ఆక్సిజన్ పరమాణవు కలిస్తే నీరు ($H_2O$) ఏర్పడుతుంది. 2 హైడ్రోజన్ పరమాణువులు, 2 పెరాక్సైడ్ ($H_2O_2$) ఏర్పడుతుంది. మామూలు నీటికీ, హైడ్రోజన్ పెరాక్సైడ్‌కి భేదమల్లా ఒకే ఒక ఆక్సిజన్ పరమాణవు మాత్రమే. పెరాక్సైడులో అదనంగా ఉన్న ఆ పక్క ఆక్సిజన్ పరమాణవు రకరకాల గమత్తులు చేస్తుంది. "3 శాతం –పెరాక్సైడు" ను గాయాలూ, పుళ్లూ కడిగి శుభ్రం చేయడానికీ, నల్లని జుట్టును బంగారు రంగులోకి మార్చడానికి ఉపయోగిస్తారు. 90 శాతం – పెరాక్సైడు చాలా ప్రమాదకరమైనది. దీనిని పరిశోధనలలో, మిలిటరీ ఆయుధాలలో మాత్రమే ఉపయోగిస్తారు. మన రాకెట్టు నడవడానికి 30 శాతం – పెరాక్సైడు చాలు. ఇది కూడా ప్రమాదకరమైనదే. చర్మానికి తగిలితే పుండు పడుతుంది. తీవ్రమైన ఏసిడును ఉపయోగించినంత జాగ్రత్తగా దీనిని ఉపయోగించాలి. పెరాక్సైడు అతిసులభంగా ఆక్సిజన్ + నీటి ఆవిరిగా విడిపోతుంది. 3 శాతం – పెరాక్సైడ్ విడిపోయినప్పుడు 10 రెట్ల అధిక ఘనపరిమాణం గల వాయువులు ఏర్పడతాయి. 90 శాతం – పెరాక్సైడు విడిపోయినప్పుడు 4000 రెట్ల అధిక ఘనపరిమాణంగల వాయువులు ఏర్పడతాయి. ఈ వాయువులే రాకెట్టుని నడుపుతాయి.




ఇప్పుడు మన రాకెట్టు ఎలా నడిపంచవచ్చో చూద్దాం. సుమారు అరలీటరు గాజుసీసా తీసుకోవాలి. దాని మూతికి బిగువుగా పట్టే రెండు రంధ్రాల రబ్బరు మూత పెట్టాలి. ఒక రంధ్రంలో సుమారు 15 సెం.మీ. పొడవు, 3 మి.మీ వ్యాసం ఉన్న గాజు గొట్టం దూర్చాలి. దేవదారు చెక్కతో (లేదా తేలికైన మరేదైనా కర్రతో గాని) – చూపుడు వేలంత లావు, 5 సెం.మీ పొడవు కలిగిన ముక్కని చెక్కి, అడుగున చిన్న రంధ్రం చేసి, అందులో అగ్గిపుల్ల దూర్చి "రాకెట్టు" తయారు చెయ్యాలి. తోకని గొట్టంలోకి జారవిడిచి రాకెట్టును గాజు గొట్టం మీద నిలబెట్టాలి. రబ్బరు మూత తాలూకు రెండవ రంధ్రాన్ని "ఇంక్ ఫిల్లర్" గొట్టం దూర్చడానికి ఉపయోగించాలి. చిన్న చమ్చాడు మేంగనీస్ డై ఆక్సైడు పొడి సీసాలో వేసి రెండు రంధ్రాల రబ్బరు మూతను బిగించాలి. ఇంక్ ఫిల్లరులోకి పది చుక్కల 30 శాతం – హైడ్రోజన్ పెరాక్సైడు ద్రవం తీసుకుని, దానిని రబ్బరు మూత తాలూకు రెండవ రంధ్రంలో బిగువుగా దూర్చి ఉంచాలి. దీనితో మన రాకెట్టును పైకి పంపడానికి అవసరమైన ఏర్పాట్లు అన్నీ పూర్తి అయినట్లే.

సీసా మూతమీద ముఖం ఉంచకుండా జాగ్రత్తపడి, ఒక్క చుక్క ద్రవం సీసాలో పడేటట్లుగా ఇంక్ ఫిల్లర్ తాలూకు రబ్బరు తిత్తిని చేతితో నెమ్మదిగా నొక్కాలి. మరుక్షణంలో సీసాలో ఉన్న హైడ్రోజన్ పెరాక్సైడును ఆక్సీజన్‌గానూ, నీటి ఆవిరిగానూ మేంగనీస్ డై ఆక్సైడ్ విడగొట్టేస్తుంది. బుస్సుమని గాజు గొట్టంలోంచి ఈ వాయువులు బయటికి వస్తాయి. గొట్టం మీదనున్న మన రాకెట్టు పదిపదిహేను అడుగుల ఎత్తుపైకి ఎగురుతుంది! కింద పడిన రాకెట్టును మళ్లీ గాజు గొట్టం మీద పెట్టి, మళ్లీ మళ్లీ రాకెట్టును ఎగురవేయవచ్చు. ఈ విధంగా చాలా సార్లు చేశాక సీసాలోని మేంగనీసు డై ఆక్సైడు పొడిని తీసేసి, కొత్త పొడిని వేయాల్సి ఉంటుంది. అన్నట్లు మేంగనీసు డై ఆక్సైడును ఈ ప్రయోగంలో "ఉత్ప్రేరకం" (catalyst) అంటారు. సాధారణంగా పెళ్లినడకలు నడిచే రసాయన ప్రక్రియలను తొందర పెట్టి బహువేగంగా నడిపించడానికి పనికివచ్చే పదార్థాలను ఉత్ప్రేరకాలు అంటారు. మామూలుగా అయితే పెరాక్సైడు నెమ్మదిగా విడిపోతుంది. మేంగనీస్ డై ఆక్సైడు వల్ల ఈ మార్పు అనేక వేల రెట్లు వేగంగా జరుగుతుంది.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి




# జింక ప్రాణం

అడవికి రాజు అయిన సింహం దాహం తీర్చుకోవడానికి నది దగ్గరకు వెళుతూ ఉండగా ఒక దీనమైన ఆర్తనాదం వినిపించింది. ఆ శబ్దం వైపు వెళ్ళి చూడగా... అక్కడ ఒక జింక కనిపించింది. అది ఒక వేటగాడు పన్నిన వలలో చిక్కుకుని విలవిలలాడుతోంది. “ఆహా... భలే పసందైన జింక మాంసంతో ఈ రోజు విందు చేసుకుంటాను,” అని మనసులో అనుకుంటూ జింకను సమీపించింది. “మృగరాజా... దయచేసి నన్ను విడిపించు. లేదంటే నేను వేటగాడికి బలి అయిపోతాను,” అని బ్రతిమిలాడింది జింక. “నిన్ను వల నుండి విడిపించినా నా పంజా దెబ్బకు నువ్వు చనిపోవాల్సిందే కదా! నీ ప్రాణాలు ఎలాగైనా పోవడం ఖాయం..! మరి నన్ను ఏమి చేయమంటావు?” అని ప్రశ్నించింది సింహం. “మృగరాజా... ఒక అనామక వేటగాడి చేతిలో చనిపోవడం కంటే మీ చేతుల్లో చనిపోవడమే ఉత్తమం అనిపిస్తోంది. కనీసం మీ ఆకలి తీర్చిన దానిని అవుతాను...” అని కన్నీరు పెట్టుకుంది జింక.

సింహం మనసు కరిగింది. జింకను వల నుండి విముక్తి చేయడానికి నిర్ణయించుకుంది. వలను తెంపడానికి తీవ్ర ప్రయత్నం చేసి విఫలం అయ్యింది సింహం. సింహానికి ఇక ఉపాయం తోచింది. దగ్గరలో ఉన్న చెట్టు దగ్గరకు వెళ్ళి బొరియలలో దాక్కున్న ఎలుకలను బయటకు వచ్చి వలను కొరికి జింకను విడుదల చేయాలని ఆదేశించింది. రాజు ఆజ్ఞను పాటించి ఎలుకలు బయటికి వచ్చాయి. క్షణాల్లో వలను కొరికేసి జింకను బంధ విముక్తిరాలిని చేశాయి. “మృగరాజా... నన్ను కాపాడినందుకు మీకు కృతజ్ఞతలు. నన్ను చంపి మీ ఆకలి తీర్చుకోండి...” అన్నది జింక... కానీ సింహం జింకను చంపకూడదు అని నిర్ణయించుకుంది. “మిత్రమా... నా పై నీకున్న గౌరవానికి సంతోషిస్తున్నాను. నిన్ను నేను ఆహారంగా స్వీకరించలేను. నీ కుటుంబం చెంతకు సంతోషంగా వెళ్ళు,” అన్నది సింహం. ఇంతలో చెట్టుపైన ఉన్న కాకి “మిత్రులారా... వేటగాడు వస్తున్నాడు. పారిపోయి ప్రాణాలు దక్కించుకోండి...” అంటూ హెచ్చరించింది. సింహానికి మరోసారి కృతజ్ఞతలు చెప్పి చెమర్చిన కళ్ళతో వేగంగా తన పిల్లల చెంతకు వేగంగా పరుగులు తీసింది జింక.

– వడ్డేపల్లి వెంకటేశ్
m :9989596554



# కలంచెలిమి



**సిహెచ్. చరణ్**
8వ, తరగతి
ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
రికాబ్ బజార్, ఖమ్మం.



**ఎం. మేఘన**
9వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
సిర్పూర్.

**పానుగుల్ల రిత్విక్**
9వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
గుంద్రాంపల్లి, నల్లగొండ జిల్లా.



**వై. లక్ష్మి**
8వ తరగతి
జి. ప. ఉ. పా. అలుగునూర్,
కరీంనగర్.






**బి. గీతిక**
7వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
గిద్దా, రామరెడ్డి మండలం,
కామారెడ్డి జిల్లా.



**మల్లవరపు అక్షయ**
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్కవరం,
చోడవరం, అనకాపల్లి, ఆంధ్రప్రదేశ్.




# భారతదేశంలోని టాప్ 10 ప్రధాన ఆనకట్టల జాబితా




నది లేదా వాగుపై నీటిని నిలుపుకోవడానికి నిర్మించిన ఆనకట్టలు. ఆనకట్టలు వ్యవసాయానికి మరియు జల విద్యుత్, తాగునీరు, నీటిపారుదల మరియు పరిశ్రమలకు నీటిని అందిస్తాయి. భారీ వర్షాల సమయంలో ఆనకట్టలు వరదలను నియంత్రించడంలో సహాయపడతాయి.

**తెహ్రీ ఆనకట్ట:** భారతదేశంలోనే అత్యంత ఎత్తైన ఆనకట్ట 260.5 మీటర్లు, ప్రధానంగా జలవిద్యుత్.

భాక్రా నంగల్ ఆనకట్ట: ఎత్తు ఆనకట్ట మరియు నీటిపారుదల, విద్యుత్తుకు కీలకమైన వనరు.

**హిరాకుడ్ ఆనకట్ట:** భారతదేశంలో అతి పొడవైన ఆనకట్ట 25.79 కి.మీ., వరద నియంత్రణ మరియు నీటిపారుదలను అందిస్తుంది.

**నాగార్జున సాగర్ ఆనకట్ట:** దాని రాతి నిర్మాణం మరియు గణనీయమైన రిజర్వాయర్ సామర్థ్యానికి ప్రసిద్ధి చెందింది.

**సర్దార్ సరోవర్ ఆనకట్ట:** నీటిపారుదల ప్రయోజనాలతో నర్మదా లోయ ప్రాజెక్టులో కీలక పాత్ర.

**శ్రీశైలం ఆనకట్ట:** దక్షిణాది రాష్ట్రాలలో జలవిద్యుత్ మరియు నీటిపారుదల.

**ఇందిరా సాగర్ ఆనకట్ట:** మధ్యప్రదేశ్‌లో విద్యుత్ మరియు నీటిపారుదలకి ప్రధాన బహుళార్ధసాధక ప్రాజెక్టు.

**ఇడుక్కి ఆనకట్ట:** ఆర్చ్ ఆనకట్ట అందం మరియు జలవిద్యుత్ ఉత్పత్తికి ప్రసిద్ధి.

**కోయ్నా ఆనకట్ట:** మహారాష్ట్ర విద్యుత్ సరఫరాకు ఇది చాలా అవసరం.

**తుంగభద్ర ఆనకట్ట:** నీటిపారుదల సామర్థ్యాల ద్వారా వ్యవసాయానికి మద్దతు ఇస్తుంది.

| ఆనకట్ట పేరు | స్థానం | నది | ఎత్తు (మీ) | ఆనకట్ట రకం | రిజర్వాయర్ సామర్థ్యం (ఎకరాల అడుగులు) | స్థాపిత సామర్థ్యం (MW) | ప్రయోజనం |
|---|---|---|---|---|---|---|---|
| తెహ్రీ | ఉత్తరాఖండ్ | భాగీరథి | 260.5 | రాక్-ఫిల్ | 2,100,000 | 1,000 | జల విద్యుత్, నీటిపారుదల |
| భాక్రా నంగల్ | హిమాచల్ ప్రదేశ్ | సట్లెజ్ | 225 | కాంక్రీట్ గ్రావిటీ | 7,501,775 | 1,325 | జల విద్యుత్, నీటిపారుదల |
| హిరాకుడ్ | ఒడిశా | మహానది | 61 | మిశ్రమ | 4,779,965 | 347.5 | వరద నియంత్రణ, నీటిపారుదల |
| నాగార్జున సాగర్ | తెలంగాణ | కృష్ణ | 124 | తాపీపని | 9,371,845 | 816 | నీటిపారుదల, జల విద్యుత్ |
| సర్దార్ సరోవర్ | గుజరాత్ | నర్మద | 138.68 | కాంక్రీట్ గ్రావిటీ | 18,000,000 | 1,450 | జల విద్యుత్, నీటిపారుదల |
| శ్రీశైలం | ఆంధ్రప్రదేశ్ | కృష్ణ | 145 | రాక్-ఫిల్ | 3,660,000 | 1,670 | జల విద్యుత్, నీటిపారుదల |
| ఇందిరా సాగర్ | మధ్యప్రదేశ్ | నర్మద | 92 | భూమిని నింపడం | 12,220 | 1,000 | జల విద్యుత్, నీటిపారుదల |
| ఇడుక్కి | కేరళ | పెరియార్ | 138.68 | వంపు | 2,000 | 780 | జల విద్యుత్ శక్తి |
| కోయ్నా | మహారాష్ట్ర | కోయ్నా | 196 | కాంక్రీట్ గ్రావిటీ | 3,640 | 1,960 | జల విద్యుత్ శక్తి |
| తుంగభద్ర | కర్ణాటక | తుంగభద్ర | 49.77 | కాంక్రీట్ గ్రావిటీ | 1,600 | 70 | నీటిపారుదల |

# జింక

జింకలు ఆర్టియోడాక్టిలా క్రమంలో సెర్విడే కుటుంబానికి చెందిన రూమినెంట్ క్షీరదాలు. ఆర్టియోడాక్టిల్స్‌లో పందులు, పశువులు, మేకలు, గొర్రెలు, ఒంటెలు, జింకలు, జిరాఫీలు మరియు హిప్పోపొటామస్‌లు కూడా ఉన్నాయి. అడవిలో జింకల జీవితకాలం దాదాపు 10 సంవత్సరాలు, జింకలు నీటిలో చాలా స్పీడ్ గా ఈదగలవు మరియు గొప్ప జంపర్, రన్నర్, సుమారు గంటకు 58 కిలోమీటర్ల వేగంతో పరుగెత్తగలవు. ఒక జింక పిల్ల పుట్టిన 20 నిమిషాలకే తన మొదటి అడుగులు వేయడం ప్రారంభిస్తుంది. జింకలకు వాసన ఉండదు కాబట్టి అవి శత్రువులచే గుర్తించబడవు. ఇతరులకు హెచ్చరికగా, జింకలు తమ తోకలను పైకి లేపుతాయి. జింకలు తల వైపులా కళ్ళు కలిగి ఉంటాయి. అవి 310 డిగ్రీల కోణంలో తన కళ్ళతో శత్రువులను మరియు ఇతర జంతువులను సైతం పసిగట్టగలదు. చాలా జింకలకు కంటి దగ్గర ఫెరోమోన్ గ్రంథులు ఉంటాయి.అవి తమ భూభాగాన్ని ఈ ఫెరోమోన్‌తో గుర్తించుకుంటాయి. జింక కొమ్ములు భూమిపై అత్యంత వేగంగా పెరుగుతున్న జీవ కణజాలం. మగ జింకలకు కొమ్ములు అని పిలువబడే ఎముక పెరుగుదల ఉంటుంది. రెయిన్ డీర్‌లో రెండు లింగాలకూ కొమ్ములు ఉంటాయి. జింకలు తమ కొమ్ములను వదిలివేసి ప్రతి సంవత్సరం కొత్త జతను పెంచుతాయి. చైనీస్ నీటి జింక ( హైడ్రోపోట్స్ ఇనర్మిస్ ) మాత్రమే కొమ్ములు లేని జాతి. కొన్ని జింక జాతులకు కొమ్ములు మరియు దంతాలు రెండూ ఉంటాయి. జింకలకు పెద్ద చెవులు, చిన్న తోకలు మరియు పొడవైన, సన్నని కాళ్ళు ఉంటాయి. జింకలు లేత నుండి ముదురు గోధుమ రంగులో సహజంగా కనిపిస్తాయి. కొన్ని జింక జాతులు ముఖ్యంగా శీతాకాలంలో శాగ్గి కోటును కలిగి ఉంటాయి.



జింకలు ఆస్ట్రేలియా మరియు అంటార్కిటికా మినహా అన్ని ఖండాలకు చెందినవి. జింకలు అడవులు, చిత్తడి నేలలు, ఎడారులు మరియు టండ్రాతో సహా అనేక రకాల ప్రదేశాలలో నివసిస్తాయి. దక్షిణ అమెరికాలోని దిగువ ఆండీస్ అడవులలో కనిపించే రెండు జాతుల పుడస్ ( పుదు జాతి) అతి చిన్న జింకలు. వయోజన మగ జింకలు భుజం వద్ద 14 అంగుళాలు (35 సెంటీమీటర్లు), 25 పౌండ్ల (11 కిలోగ్రాములు) బరువు ఉంటాయి. అతిపెద్ద జింక మూస్, వయోజన మగ జింకలు 84 అంగుళాల (215 సెంటీమీటర్లు) కంటే ఎక్కువ పొడవు, 1,300 పౌండ్ల (600 కిలోగ్రాములు) బరువు ఉండవచ్చు. అన్ని జింక జాతులలోని ఆడ జింకలు సాధారణంగా మగ జింకల కంటే చిన్నవిగా ఉంటాయి.

జింకలు తెల్లవారుజామున మరియు సాయంత్రం వేళల్లో, సూర్యోదయానికి ముందు మరియు అస్తమించిన వెంటనే చాలా చురుగ్గా ఉంటాయి. ఈ సంధ్యా సమయాలు జంతువులు చూడటానికి తగినంత వెలుతురుతో ఉంటాయి కానీ అవి వేటాడే జంతువులకు తక్కువగా కనిపించేంత మసకగా మరియు నీడగా ఉంటాయి. జింకలు ఆహారం కోసం ఎక్కువ సమయం వెతుకుతాయి. అవి శాకాహారులు, అంటే అవి మొక్కలను తింటాయి. లేత గడ్డి, మూలికలు, లైకెన్లు, ఆకులు, మొగ్గలు, జల మొక్కలు, కలప రెమ్మలు మరియు పండ్లను ఆహారంగా తీసుకుంటాయి. ఈ అధిక నాణ్యత ఆహారం కొమ్ముల పెరుగుదలకు అవసరమైన ఖనిజాలు మరియు ప్రోటీన్లను అందించడంలో సహాయపడుతుంది. జింకలలో 43 జాతులు (అవి. తెల్ల తోక గల జింక, మ్యూల్ జింక, ఎర్ర జింక, దుప్పి, ఎల్క్ (వాపిటి), రెయిన్ డీర్ (కారిబౌ).. etc) జింకలు ఉన్నాయి. జింకల సమూహాన్ని సాధారణంగా మంద అని పిలుస్తారు. జింకలను అనేక పురాణాలు మరియు గాథల్లో ప్రస్తావించబడ్డాయి. భారతదేశంలోని ఉన్న జింకలను “శాంతి” మరియు “ప్రకృతి సౌందర్యం”కి ప్రతీకగా భావిస్తారు. భారతదేశంలోని జింకలు చితల్ (Chital), సాంబర్ (Sambar), నీలగిరి మేకపులు (Nilgiri Tahr), హార్ట్‌బీట (Hog Deer), మరియు రెడ్ డియర్ (Red Deer) ముఖ్యమైనవి. వీటి సహజ వాతావరణాలు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఉన్నాయి. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (IUCN) అనేక జింక జాతులను అతి తక్కువ ఆందోళన కలిగించేవిగా పరిగణించింది. యునైటెడ్ స్టేట్స్ మరియు కెనడాలో తెల్ల తోక గల జింకలు చాలా తక్కువగాకనిపిస్తాయి. భారతదేశంలోని తెలంగాణ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మణిపుర్, ఉత్తరఖాండ్, ఒడిశా రాష్ట్రాలలో జింకను రాష్ట్ర జంతువుగా ప్రకటించాయి. రాష్ట్ర మరియు ప్రాంతీయ ప్రభుత్వాలు జింకల సంరక్షణ కొరకు వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972, షెడ్యూల్ 3ని రూపొందించారు. ప్రజలు జింకల ను వేటాడేందుకు అనుమతులు పొందాలని మరియు ప్రతి సంవత్సరం ఎన్ని జింకలను చంపవచ్చనే దానిపై పరిమితులు విధించడం వంటి నిబంధనలు ఉన్నాయి. సాంబార్, రెయిన్ డీర్, చైనీస్ వాటర్ డీర్ మరియు మార్ష్ డీర్ వంటి జాతులు అంతరించిపోతున్నాయాని IUCN జాబితాలో పేర్కొంది.

– సచిన్ కోత్వాల్



కథ

# పందెం కాసిన చెట్టు



అనగనగా ఒక దట్టమైన అడవిలో వేప, గానుగ, చింత, రావి మరియు మామిడి చెట్లు ఎంతో స్నేహంగా ఉండేవి. అన్ని చెట్లు పక్కపక్కనే ఉండడంతో ఎప్పుడూ మాట్లాడుకునేవి. ఒక వేప చెట్టు మిగతా చెట్లతో "మనమంతా ఈ మనుషులకు ఎన్ని సౌకర్యాలు కలిగిస్తుంటే వాళ్ళు ఎందుకు ఎప్పుడు మనల్ని నరికేస్తూ ఉంటారు? ఇంత క్రూరంగా ఆలోచిస్తారు ఏమిటి? ఈ మనుషులు" అని అంటుంది.

"అవును వేపా! మనం ఎంత చేసినా ఈ మనుషులకు అసలు విశ్వాసమే ఉండదు" అని అంటుంది రావి చెట్టు. "అవునవును" అంటుంది గానుగ చెట్టు. "ఈ మనుషులకు మనం ఎలాగైనా బుద్ధి చెప్పాలి" అంటాయి చింతా మరియు మామిడి చెట్లు. అలా మాట్లాడుకుంటూ ఉండగానే ఒక మనిషి అటుగా గొడ్డలి పట్టుకొని వస్తుంటాడు. వచ్చి అన్ని చెట్లను చూసి వేప చెట్టుని గొడ్డలితో నరకబోతాడు. వెంటనే మిగతా చెట్లన్నీ కలిసి "నరకొద్దు! నరకొద్దు! మా వేప చెట్టును నరకొద్దు అని గట్టిగా అరుస్తాయి.

ఆ అరుపులకు అతడు భయపడిపోయి అటు ఇటు చూస్తాడు. ఎవరూ కనబడరు. అతను చాలా భయపడి పోతాడు. మళ్ళీ వేప చెట్టును నరకడానికి గొడ్డలి పైకెత్తుతాడు. అతనికి మళ్ళీ అరుపులు వినబడుతుంటే పైకి చూస్తాడు చెట్లన్నీ వేప చెట్టును నరకవద్దని అరుస్తుంటాయి. అతను ఆశ్చర్య పోతాడు. చెట్లు మాట్లాడడం చూసి అతను పారిపోతాడు. వేప చెట్టు క్షేమంగా ఉండడంతో మిగతా చెట్లు సంతోష పడతాయి. అతను వెళ్లి వాళ్ళ ఊరు వారందరికీ విషయం చెప్తాడు. అందరూ ఆశ్చర్యపోతారు. అందరూ కలిసి అడవికి వెళ్తారు. అందర్నీ చూసి చింతచెట్టు "ఎందుకు మీరంతా ఒకేసారిలా కలిసి వచ్చారు?" అని అడుగుతుంది. అందరూ ఆశ్చర్యపోతారు "నువ్వు ఎలా మాట్లాడగలుగు తున్నావు" అని అడుగుతాడు ఒక పెద్ద మనిషి. "మాకూ మాట్లాడడం వచ్చులే!" అని అంటుంది చింత చెట్టు. ఇతను "చెట్లు నరకడానికి వస్తే మీరంతా అరిచారట కదా! అప్పుడు. ఇతను భయపడి పోయాడు. ఇప్పుడు నరుకుతాడు" అని మొదట వచ్చిన అతని చూపిస్తూ మాట్లాడుతాడు ఆ పెద్దమనిషి.

అప్పుడు "అయినా మీరు మమ్మల్ని ఎందుకు నరకాలనుకుంటున్నారు?" అని అడుగుతుంది మామిడి చెట్టు.

"మేము ఇక్కడ ఒక ఫ్యాక్టరీ పెట్టాలనుకుంటున్నాం అందుకే మిమ్మల్ని నరకాలి అనుకుంటున్నాము. అని అంటారు ఊరి ప్రజలు. "మీరు ఫ్యాక్టరీ పెట్టాలని అంతగా అనుకుంటే మీ ఇళ్ళను పీకి ఫ్యాక్టరీ పెట్టుకోండి!" అని అంటుంది గానుగ చెట్టు.

"మేము ఇళ్ళను పీకి ఫ్యాక్టరీ పెట్టుకుంటే మరి మేము ఎక్కడ ఉండాలి?" అని అడుగుతారు ఊరి ప్రజలు.

"మీ సంతోషం కోసం మమ్మల్ని నరికేస్తారా? మేము వదిలేసే గాలినే పీలుస్తారు, మేము ఇచ్చే పండ్లనే తింటారు, మేము ఇచ్చే పూలనే పెట్టుకుంటారు. మా చల్లగాలి నీడనే కూర్చుంటారు. అసలు మేము లేకపోతే మీకు జీవితమే లేదు. అయినా కానీ మమ్మల్ని నరికేస్తారా?" అని అంటుంది వేపచెట్టు.

"అంత గొప్ప వాళ్ళు మీరు?" అని అంటాడు ఒక కుర్రవాడు. "మేం గొప్ప వాళ్ళమో కాదో చూద్దాం. అందుకే మీకు మాకు ఒక పోటీ పెట్టుకుందాం. మీరంతా ఇక్కడే ఉండండి మేము ఒక ఏడు నిమిషాలు మీకు ఆక్సిజన్ ఇవ్వం. మీరు తట్టుకొని ఉంటే మమ్మల్ని మీరు నరకవచ్చు. అదే మీరు ఓడిపోతే మనిషికి 19 మొక్కలు చొప్పున అందరూ మొక్కలు నాటాలి" అని అంటుంది రావి చెట్టు.

ఊరి ప్రజలందరూ పోటీకి ఒప్పుకుంటారు. “ఎవరూ వీరికి గాలిని ఇవ్వద్దు” అని అంటుంది మామిడి చెట్టు. ఒక్కసారిగా అడవిలో ఆక్సిజన్ మరియు ఇతర గాలులు ఆగిపోతాయి. నిమిషం పాటు ప్రజలంతా నిశ్శబ్దంగా ఉంటారు. రెండు నిమిషాలకు దేనికోసమో వెతుకుతున్నట్టు తపిస్తుంటారు. మూడు నిమిషాలకు చనిపోతామేమో అన్న భయం వేస్తుంది. ఇక నాలుగు నిమిషాలకు అందరూ గిరగిలా కొట్టుకుంటారు. ఎవరి నోటి వెంట మాట కూడా రాదు. వారందరూ చచ్చిపోతారేమోనని జాలిపడి చెట్లన్నీ ఒక్కసారిగా ఆక్సిజన్ని వదులుతాయి.

“చూశారా! మేము లేకుండా ఐదు నిమిషాలు కూడా ఉండలేకపోయారు” అని అంటుంది వేపచెట్టు.

“చావు అంచుల వరకు తీసుకెళ్లారు. మేము ఓడిపోయాము మిమ్మల్ని ఇంకెప్పుడు నరకం మమ్మల్ని క్షమించండి.” అని ఊరి ప్రజలు తప్పు ఒప్పుకుంటారు. చెట్ల విలువ తెలుసుకుంటారు. మనిషికి 19 చొప్పున అందరూ మొక్కలు నాటుతారు. ఈ గొప్ప విషయం వారికే కాకుండా అందరికీ తెలియాలని పక్క వూరిలో కూడా పోస్టర్లు అంటిస్తారు. ఎవరు చెట్లను నరకొద్దని కోర్టులో కేసు కూడా పెడతారు. కష్టపడి కేసు గెలుస్తారు. ఒక్క మొక్కనైనా, చెట్టునైనా నరికితే 2000 జరిమానా అని కోర్టు తీర్పు కూడా ఇస్తుంది. ఆ భయంతో ఎవరూ చెట్లని నరకరు అందరూ చెట్ల విలువను తెలుసుకుంటారు.

నీతి : చెట్లు మనకి అన్ని ఇస్తున్నా మనం మాత్రం వాటిని నరికేస్తున్నాం. ఇలా నరుక్కుంటూ పోతే ఆ ఊరి ప్రజలకు కలిగిన పరిస్థితే మనకు కూడా తప్పకుండా కలుగుతుంది.

– భూక్యా కవిత
7వ తరగతి, పాపకొల్లు, జూలురుపాడు,
భద్రాద్రి కొత్తగూడెం.
m : 9441815722

## ✧ పుస్తక పరిచయం



# పుస్తక పరిచయం



**ఆకుపచ్చని కథలు**
(పిల్లల కథలు)
అరుణ బట్టువార్
m : 9963806368




**ఊగుతున్న ఉయ్యాల**
(బాలల గేయాలు)
కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655



**సమయం కన్నా సాయం మిన్న**
కె.వి. లక్ష్మణరావు
m : 9014659041

**పందెం కాసిన చెట్లు**
(పిల్లల కథలు)
భూక్యా వర్షిత
m : 9441815722



**పంచుకుంటే ఆనందం**
కంచనపల్లి వేంకట కృష్ణారావు
m : 9348611445




**కరదీపిక**
(మహనీయుల గాథలు)
డా॥ నెమిలేటి కిట్టన్న
m : 9490182636






**చెప్పితే సగం ఇవ్వాలి!**
(బాల కథల సంపుటి)
పెందోట వెంకటేశ్వర్లు
m : 9440524546



**అమ్మమ్మ ప్రేమ**
(కథల పుస్తకం)
సంపాదకులు:
ప్రవీణ్ శర్మ



**అరుగు బడి**
(బాలల కథలు)
దుర్గమ్ భైతి
m : 9959007914

# బాలచెలిమి గ్రంథాలయం

జెడ్.పి.హెచ్.ఎస్., పానుగల్, వనపర్తి జిల్లా.

## విద్యార్థులలో పుస్తక పఠనం పెంపొందిస్తున్న బాలచెలిమి గ్రంథాలయం..

ఒక మంచి పుస్తకం వంద మంది స్నేహితులతో సమానం అంటారు. పుస్తకం చదవడం కేవలం పరీక్షల కోసమో, విషయపరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం కోసమో, విరామ సమయాన్ని సద్వినియోగం పరచుకోవడం కోసమో మాత్రమే కాదు. పుస్తకం చదువుతున్నంత సేపు ఆ పుస్తకంలో ఉన్న సమాచారం, ఆ సందర్భం, ఆ కాలంనాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు, మానవ స్వభావము, మనుషుల భౌగోళిక, జీవన స్వరూపము వంటి అనేక విషయాలు పాఠశాల స్థాయిలో విద్యార్థులు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇలాంటి ఒక ప్రత్యేక అవసరాన్ని గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేయబడిన కొన్ని పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయాన్ని స్థాపించడం ఆధునిక కాలంలో ఒక అక్షర ఉద్యమంగా పేర్కొనవచ్చు. విద్యార్థులలో అధ్యయనం పట్ల ఆసక్తిని పెంపొందించ డానికి పాఠశాల గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. పానుగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న 350 మంది బాలబాలికలకు బాలచెలిమి గ్రంథాలయం ఒక వరంలా ఉపయోగ పడుతున్నది. సోషల్ మీడియా ప్రభావం విద్యార్థులపై విస్తృతంగా ఉన్న ప్రస్తుత పరిస్థితులలో పిల్లలను పుస్తకాల పట్ల ఆసక్తి కలిగించడం కత్తి మీద సాము వంటిది.



ఒకవైపు రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికత, అందుబాటులో ఉండే వివిధ రకాల ఆధునిక సమాచార వ్యవస్థలు విద్యార్థులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో పాఠశాలలో సరైన లైబ్రరీ వసతులు లేకపోవడం, ఏదో కొన్ని పాఠశాలల్లో ఉన్నప్పటికీ పిల్లల ఆసక్తికి అనుగుణమైన పుస్తకాలు లేకపోవడం వంటి ప్రతికూలతల వలన విద్యార్థులు పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. రోజువారి పాఠ్యపుస్తకాలు చదవడంలోనే కొంత విసుగు చెందడం, విరామం లేకపోవడం, చదవాలనే ఆసక్తి ఉన్నా వారి అభిరుచులకు తగిన పుస్తకాలు అందుబాటులో ఉండకపోవడం వంటి వాటి వలన పుస్తకాల పట్ల అభిరుచి తగ్గడానికి మరొక కారణమవుతున్నది. ఇలాంటి సందర్భంలో బాలచెలిమి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి సుమారు 40 వేల రూపాయల విలువ గలిగిన అన్ని రకాల పుస్తకాలను అందజేయడం పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నది. తెలుగు కథల పుస్తకాలు, గణిత పరిజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు, బొమ్మలతో కూడిన చిన్న చిన్న పొడుపు కథలకు సంబంధించిన పుస్తకాలు, వివిధ రంగాలకు చెందిన శాస్త్రవేత్తలకు సంబంధించిన పుస్తకాలు, మహనీయుల పుస్తకాలు, సైన్సు సామాజిక శాస్త్రాల వంటి అనేక రకాలైన పుస్తకాలను అందించడం వలన విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో, ఆసక్తితో గ్రంథాలయాన్ని ఉపయోగించుకుంటున్నారు. తద్వారా కనుమరుగవు తున్న నైతిక విలువలు పెంపొందించడంలో పరోక్షంగా బాలచెలిమి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంత నేపథ్యమున్న పిల్లలు, నిరక్షరాశ్యులయిన తల్లిదండ్రులు, చదువుకోవడానికి అనుకూలంగా లేని కుటుంబ పరిస్థితులు వంటి అత్యంత క్లిష్ట పరిస్థితులలో చదువు పట్ల ఆసక్తి కలిగిన పిల్లలకు మా పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం వారి అభ్యున్నతికి ఎంతగానో ఉపయోగ పడుతుంది. పాఠశాల దశలో అధ్యయనం పట్ల ఆసక్తి పెంపొందించగలిగితే భవిష్యత్తులో వారు ఏ రంగంలో స్థిరపడినా పుస్తకాలతో మమేకమై ఉంటారో, ఎవరైతే నిత్య విద్యార్థిగా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకుంటారో అలాంటి వారు ఉత్తమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు అవుతారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి మంచి అవకాశాన్ని కల్పించిన బాలచెలిమి సంపాదక వర్గానికి, నిర్వాహకులకు విద్యార్థుల, ఉపాధ్యాయుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు.

– సి. కిరణ్ కుమార్
m : 9441016299







తెలుగు కథానికల సాహిత్యంలో ఉన్న విశిష్టతను గుర్తించి, మరింత ఉద్వేగభరితమైన ప్రోత్సాహాన్ని కలిగించేందుకు ఆవిర్భవించిన భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ 2025 పురస్కారాల ప్రదానోత్సవ సభ 2025 మే 18న ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఘనంగా నిర్వహించబడింది.

భూపతి చంద్ర స్మారక కథానిక పోటీ అధ్యక్షులు యం.ఎల్. కాంతారావు సభకు అధ్యక్షత వహించారు. ఈ సభకు సీనియర్ సంపాదకులు కె. రామచంద్రమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆత్మీయ అతిథిగా సినీ దర్శకుడు, సాంస్కృతిక ప్రతినిధి బి. నరసింగరావు, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ (పూర్వాధ్యక్షులు, తెలుగు శాఖ, నాగార్జున యూనివర్సిటీ) పాల్గొన్నారు. ఆల్ ఇండియా రేడియో పూర్వాధ్యక్షులు రాంబాబు నిర్వహణలో కార్యక్రమం కొనసాగింది. వక్తలు మాట్లాడుతూ కథానిక ప్రక్రియలోని జీవన అనుభవాలు, ఆలోచనలు ప్రతిబింబించే విధానం గురించి మాట్లాడి, ఈ స్మారక పోటీ ప్రామాణికంగా నిలవాలని ఆశాభావాలు తెలిపారు. BCMT ట్రస్ట్ అధ్యక్షులు ఎం.ఎల్. కాంతారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ అవార్డులు నిర్వహిస్తూ సాహిత్యానికి ప్రోత్సాహం కలిగిస్తామని చెప్పారు.

చిరునామా : **అధ్యక్షులు, "ఆనంద నిలయం"**
ఇం.నం. 1-5-1020/4, బి.ఆర్.రావు నగర్,
ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ - 500010.
తెలంగాణ, భారత్.

## పురిమళ్ల ఫౌండేషన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో...

16 సం.ల లోపు విద్యార్థులకు జాతీయస్థాయి కథలు, కవితల పోటీ. ఉత్తమ కథలు, కవితలకు 10 సమాన నగదు బహుమతులు. అంశం : ఏదైనా సామాజిక అంశం (పర్యావరణ పరిరక్షణ, దేశభక్తి, శాస్త్రీయ, మానవీయ విలువలు మొదలైనవి).

కథ రాతలో 4 పేజీలు మించకూడదు. (డిటిపి అయితే 2 పేజీలుండాలి), కవిత 10 నుండి 20 లైన్లు మాత్రమే. రచనలు పంపాల్సిన చివరి తేది : జూన్ 30 2025.

ఎంపికైన ఉత్తమ, సాధారణ కథలు, కవితలు సంకలనంగా తీసుకురాబడును. పోస్ట్ లేదా కొరియర్ ద్వారా మాత్రమే కథలు, కవితలను పంపాలి.

చిరునామా : **భోగోజు ఉపేంద్రరావు,**
ఇ.నెం. 11-10-694/5, బురహాన్పురం,
ఖమ్మం - 507001. సెల్ : 9494773969

## 7 గ్రంథాలకు సారస్వత పరిషత్తు పురస్కారాలు

తెలంగాణ సారస్వత పరిషత్తు 2025 సంవత్సరానికి వివిధ ప్రక్రియల్లో 7 ఉత్తమ గ్రంథాలకు పురస్కారాలు ప్రకటించింది. ఈ ఏడాది అత్యధికంగా వచన కవితలో 48 గ్రంథాలు పోటీకి వచ్చాయని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా.జుర్రు చెన్నయ్య తెలిపారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన త్వరలో హైదరాబాద్‌లో జరిగే వేడుకలో పురస్కారాలు ప్రదానం చేస్తామని, ఒక్కొక్కరికి రూ. 20 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందిస్తామని వివరించారు. పద్య/గేయ కవిత్వంలో డా. కాంచనపల్లి గోవర్ధన రాజు రచించిన 'నిరుడు కురిసిన నిప్పు-బల్మూరి కొండలరాయుడు' గ్రంథం, వచన కవిత్వంలో ఉదారి నారాయణ రచించిన 'మళ్లీ మనిషిలోకి' కవితా సంపుటి, నవలా విభాగంలో డా. కాలువ మల్లయ్య రచించిన 'గువ్వల చెన్నా' నవల, సాహిత్య విమర్శలో డా. సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన 'సవారు' ముస్లిం వ్యాసాలు, కథాప్రక్రియలో రామాచంద్రమౌళి రచించిన 'నిర్వాణ' కథల సంపుటి, ఇతర ప్రక్రియల విభాగంలో సంగనభట్ల నరసయ్య రచించిన 'కోటిలింగాల-తెలంగాణ ప్రాచీన చారిత్రక వ్యాసాలు' గ్రంథం, **బాలసాహిత్యంలో డా. అమరవాది నీరజ రచించిన 'ఏడు రంగుల జెండా' పుస్తకం పురస్కారాలకు ఎంపికయ్యాయి.**

ప్రముఖ సాహితీవేత్తలు డా.ఎన్.ఆర్.వెంకటేశం, ఎలనాగ, రంగరాజు పద్మజ, రూప్‌కుమార్ డబ్బీకార్ సంగిశెట్టి శ్రీనివాస్ 'వరిష్ఠ' పురస్కారాలకు ఎంపికయ్యారు.

## "వరాల బేరం" పిల్లల కథల సంపుటి ఆవిష్కరణ



మచిలీపట్నంలో స్థానిక మహతి లలిత కళా వేదికలో 23-05 2025 శుక్రవారం సాయంత్రం శ్రీకళ్ళేపల్లి తిరుమలరావు రచించిన వరాల బేరం పిల్లల కథల సంపుటి ఆవిష్కరించబడింది. సభాధ్యక్షులు శ్రీభవిష్య మాట్లాడుతూ ఇటువంటి మరిన్ని పుస్తకాలు రావాలన్నారు. ముఖ్య అతిథి మరియు పుస్తక ఆవిష్కర్త శ్రీగుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని పెంచడానికి ఇటువంటి పుస్తకాలు దోహదపడతాయని పేర్కొన్నారు. గౌరవ అతిథి శ్రీ లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ బాల సాహిత్య అభివృద్ధి జరగాలి అని ఆకాంక్షించారు. మరో గౌరవ అతిథి శ్రీ టి. పెద్దిరాజు మాట్లాడుతూ ఇటువంటి నీతి కథలు పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయన్నారు. శ్రీఅప్పినేడి పోతురాజు వరాల బేరం పుస్తకాన్ని సమీక్షిస్తూ ఈ పుస్తకం పిల్లలే కాదు పెద్దలు కూడా చదవదగినది అన్నారు. రచయిత శ్రీ కళ్ళేపల్లి తిరుమలరావు మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని తిరిగి పెంచేందుకు బాల్యం నుంచే చదివే అలవాటును పెంచాలని, అందుకు బాల సాహిత్యం తగినదని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రచయిత శ్రీ కళ్ళేపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. విశ్రాంత బ్యాంకు మేనేజర్ సత్యనారాయణమూర్తి ఆలపించిన మా తెలుగు తల్లికి మల్లెపూదండతో కార్యక్రమం ప్రారంభమైంది.

## "ఊగుతున్న ఉయ్యాల" బాలగేయాల సంపుటి ఆవిష్కరణ

తేదీ : 25-05-2025 నాడు హైదరాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన బాల సాహిత్య సదస్సులో "ఊగుతున్న ఉయ్యాల" బాలగేయాల సంపుటిని శాంతా- వసంతా ట్రస్ట్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ. వరప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. నల్లగొండకు చెందిన బాల సాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రాసిన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యార్థుల మనోవికాసానికి ఇలాంటి పుస్తకాలు ఎంతో దోహద పడతాయని, విద్యార్థుల్లో దాగి ఉన్న



సృజనాత్మక శక్తులను వెలికి తీసేందుకు బాల సాహితీ రచయితలైన ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని కొనియాడారు. రోజంతా జరిగిన ఈ బాల సాహిత్య సమ్మేళనం మెరుగైన సమాజం కొరకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా దక్షిణ ప్రాంతీయ అధికారి డాక్టర్ ప్రతిపాక మోహన్, ప్రముఖ కథా రచయిత మేరెడ్డి యాదగిరి రెడ్డి, ప్రముఖ బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్, పుస్తక రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డితో పాటు అనేకమంది బాలసాహితీవేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# భాగ్యరెడ్డి వర్మ

అంబేద్కర్ కన్నా ముందే దేశవ్యాప్తంగా 'ఆదిహిందువు'ల, నిమ్నజాతుల (హరిజన అనే పదాన్ని భాగ్యరెడ్డి వర్మ నిర్ద్వందంగా వ్యతిరేకించిండు) వారి నాయకుడిగా గుర్తింపు పొందినవాడు భాగ్యరెడ్డి వర్మ. రాజా వరకు ఎందరో మన్ననలు అందుకున్న ఆయన 128వ జయంతి మే 22న జరుపుకున్నాం.

నిజానికి ఈ దేశ మూలవాసులు దళితులేనని బోధిస్తూ, వారి పట్ల సమాజం చూపిస్తున్న వివక్షా వైఖరిని ఖండిస్తూ ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే ఉద్దేశంతో 1906లోనే 'జగన్మిత్రమండలి' అనే సంస్థను నెలకొల్పి దాని ద్వారా కృషి చేసిండు. 50 సంవత్సరాల జీవితంలో 32 యేండ్లు ప్రజాశ్రేయస్సుకోసం వినియోగించిన భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. నిజాం ప్రభుత్వంతో పోరాడి దళితుల కోసం ప్రత్యేక పాఠశాలలు, బ్రహ్మసమాజ్, ఆర్యసమాజ్, సంఘసంస్కార నాటక మండలి, దేవదాసీ నిర్మూలనోద్యమం, ఆదిహిందువుల ఐక్యత, రాజకీయ వాటా కోసం, దళితుల ఆర్థిక, సామాజిక ప్రగతి కోసం ఆయన చేసిన కృషి ఇప్పటికీ గుర్తింపుకు నోచుకోలేదు.



భాగ్యరెడ్డి వర్మ భాగ్యనగర్, ఆదిహిందూ పత్రికల్ని నడిపించడమే గాకుండా దళితుల హక్కుల కోసం పోరాటం చేసిన తొలి నాయకుల్లో ప్రథముడు, హక్కులు కాపాడడంలో భాగంగానే 1938లోనే ఆదిహిందూ పత్రికలో "ప్రాథమిక హక్కులు" అనే సంపాదకీయం రాసిండు.

ఆ కాలంలో తెలంగాణాలో మొత్తం చదువుకున్న తెలుగువారి జనాభా ఐదారు శాతానికి మించదు. ఇందులో దళితుల అక్షరాస్యతా శాతం మరీ అధ్వాన్నం అయితే నిమ్నజాతుల వారి గోడు అగ్రకులాల వారికి కూడా తెలియాలి. ముందు వారు సమస్యను సానుకూలంగా అర్థం చేసుకునేందుకు పత్రికా రచన ఉపయోగపడుతుందని నమ్మి దాన్ని నిర్వహించిన వినయ సంపాదకుడు భాగ్యరెడ్డి వర్మ. పత్రికల్లో రాజరామ్మోహనరాయ్, బ్రహ్మసమాజ్, బుద్ధ జయంతి సందర్భంగా రాసిన సంపాదకీయాలు ఆనాటి అనేక విషయాల్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి.

దీనితో పాటుగా ఆదిహిందూ వార్షిక సభల సందర్భంగా చేసిన సుదీర్ఘ ఉపన్యాసాలు ఇది వరకే కొన్ని చిన్న చిన్న బుక్‌లెట్స్‌గా ప్రచురింపబడ్డాయి. వాటిలో పోలీసు, సైనిక విభాగాల్లో ఆదిహిందువులను చేర్చుకోవడంలో చూపిస్తున్న వివక్ష, వెట్టి చాకిరీలను విమర్శిస్తూ చేసిన ఉపన్యాసాలు తర్వాతి కాలంలో వ్యాసాలు పత్రికల్లో అచ్చయ్యాయి. అలాగే ఆంధ్రమహాసభ వాళ్ళు ప్రతి యేటా 1930 నుంచి నిర్వహించిన సభలకు భాగ్యరెడ్డి వర్మ తప్పనిసరిగా హాజరయ్యేవారు. ఆయా సభల్లో ఆయన చేసిన ప్రసంగాలు కూడా ఆ కాలంలో పత్రికల్లో అచ్చయ్యాయి.

నిజానికి భాగ్యరెడ్డి వర్మ రచనలు చాలా వరకు అలభ్యంగా ఉన్నాయి. భాగ్యరెడ్డి వర్మ తన పేరు, హైదరాబాద్ పేరూ రెండూ వచ్చే విధంగా ఏర్పాటు చేసిన 'భాగ్యనగర్' పత్రిక ప్రతులు నాలుగైదు సంచికలు మించి ఇప్పుడు అందుబాటులో లేవు. భాగ్యనగర్ ఆదిహిందూ పత్రికా ప్రతులు దొరికినట్లయితే భాగ్యరెడ్డి వర్మ రచనలపై మరింత లోతుగా పరిశీలన చేయడానికి వీలవుతుంది.

ఇప్పటికే ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి భాగ్యరెడ్డి వర్మ మీద ఒక ఎంఫిల్ పరిశోధన జరిగింది. నిజానికి నాలుగైదు పిహెచ్డీలు చేయగలిగినంత సమాచారం, ఉన్నతి ఉన్న వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ.

(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన 'తెలంగాణ తేజోమూర్తులు' నుంచి)

– డా. సంగిశెట్టి శ్రీనివాస్
m : 9849220321

# "భూపతి చంద్ర" స్మారక కథానికల బహుమతుల ప్రదానోత్సవ సభ - 2025

**తేది : 2025 మే 18, తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, ఆబిడ్స్, హైదరాబాద్.**



**కథా పురస్కారాలు 2025**

**ప్రథమ బహుమతి :** వాగంటి ప్రసాద్

**ద్వితీయ బహుమతి :** ఉప్పలూరి మధుపత్ర శైలజ

**తృతీయ బహుమతి :** కొండి మల్లారెడ్డి

**ప్రోత్సాహక పురస్కారాలు :**

ఎం. శ్రీనివాసరావు, పప్పు శాంతాదేవి, కామరాజుగడ్డ వాసవదత్త రమణ, గొర్తివాణి శ్రీనివాస్, ఎన్. గంగాలక్ష్మి




"భూపతి చంద్ర" స్మారక కథానికల పోటీ 2025 పురస్కార ప్రదానోత్సవ సభ 18 మే 2025 ఆదివారం సాయంత్రం 5.30 ని॥లకు 'భూపతి చంద్ర' మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ ఎమ్.ఎల్. కాంతారావుగారి అధ్యక్షతన తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, హైదరాబాదు నందు జరిగింది.

భూపతి చంద్ర స్మారక కథానిక పోటి అధ్యక్షులు యం.ఎల్. కాంతారావు సభకు అధ్యక్షత వహించారు. శ్రీమతి శారదరెడ్డి గారు శ్లోక పఠనం చేశారు. ఈ సభకు సీనియర్ సంపాదకులు కె.రామచంద్ర మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆత్మీయ అతిథిగా సినీ దర్శకుడు, సాంస్కృతిక ప్రతినిధి బి. నరసింగరావు, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ (పూర్వాధ్యక్షులు, తెలుగు శాఖ, నాగార్జున యూనివర్సిటీ) పాల్గొన్నారు. ఆల్ ఇండియా రేడియో పూర్వాధ్యక్షులు రాంబాబు నిర్వహణలో కార్యక్రమం కొనసాగింది.

సభకు అధ్యక్షత వహించిన కాంతారావు, తమ తండ్రి స్వర్గీయ శ్రీ భూపతిరావు, తల్లి స్వర్గీయ శ్రీమతి చంద్రమ్మగారల స్మారకార్థం వారి పేర మెమోరియల్ ట్రస్టును ఏర్పాటు చేశామని దానిలో భాగంగా "భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ 2025" నిర్వహించామని, ఈ పోటీలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా తమిళనాడు, న్యూఢిల్లీ, పూణె, బెంగుళూరు, ముంబాయి నగరాల నుండి కూడా వందకు పైగా కథానికలు వచ్చాయని పురస్కారాలు పొందిన రచయితలకు, రచయిత్రులకు, న్యాయనిర్ణేతలకు అభినందనలు తెలిపి పోటీలో పాల్గొన్న రచయితలకు, రచయిత్రులకు అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కథానికల పోటీకి వచ్చిన కథానికల నన్నింటిని తాను చదివానని, న్యాయ నిర్ణేతలు నలుగురు కూడా చదివినారని అందరము చదివిన తర్వాత పారదర్శకంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ మరియు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించామన్నారు. ఈ కథానికల పోటీ కార్యక్రమమును ప్రతి సంవత్సరము నిర్వహించుటకు అందరి సహకారముతో కృషి చేస్తామన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ పత్రికా సంపాదకులు శ్రీ కె.రామచంద్రమూర్తిగారు మాట్లాడుతూ ఈ ఉరుకుల, పరుగుల జీవితములో చాలా మంది జీవించియున్న తల్లిదండ్రులనే మరచిపోతున్న ఈ రోజుల్లో తల్లిదండ్రుల స్మారకార్థం వారి కుమారులు ఐదుగురు వారి పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేయడం, ట్రస్ట్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం, కథానికల పోటీని నిర్వహించి పురస్కార ప్రదానోత్సవం గావించడం ఎంతో అభినందనీయమని అన్నారు. సాహితీ ప్రక్రియలలో తనకు కూడా కథానిక ప్రక్రియ ఎంతో ఇష్టమని తెలియజేశారు.

ఈ ట్రస్ట్ తరపున ఇదేవిధంగా ప్రతి సంవత్సరం కథానికల పోటీని నిర్వహించాలని ఆశిస్తున్నాను అని అన్నారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ గారు మాట్లాడుతూ సాహిత్య చరిత్రలో "కథానిక" ప్రక్రియకున్న విశిష్టత చాలాగొప్పదని, ఈనాటికి పాఠకలోకం ఆదరిస్తున్న ఒకటి, రెండు ప్రక్రియలలో కథానిక మొదటిది అన్నారు.

శ్రీ బి.నరసింగరావు గారు సభనుద్దేశించి మాట్లాడుతూ తమ కుటుంబం చిన్నప్పటి నుండి పుస్తకాలు, కవితలు చదివే ఆసక్తి మరియు కవిత్వంపై ఉన్న ఆసక్తి గురించి వివరించారు. సుప్రసిద్ధ రచయిత శ్రీ నవీన్‌గారు అంపశయ్య నవల రచించి 50 సం॥లు పూర్తి చేసుకున్న సందర్భంగా BCMT తరపున 2019లో వారికి 'కీర్తిశిఖర' అవార్డును అందజేశామన్నారు.

శ్రీ కాంతారావుగారు రాజకీయాల్లో రాణిస్తూనే సంగీత, సాహిత్యాలలో అభినివేశం కలిగి యుండడం తనకు ఎంతో ఆశ్చర్యం, ఆనందం కలిగిస్తుందని ఈ వయస్సులో కూడా వారు పోటీకి వచ్చిన ప్రతి కథానికను చదివి న్యాయ నిర్ణేతలతో చర్చించి నిర్ణయం తీసుకోవడం వారికే చెల్లిందని అన్నారు.

రమణ సభా కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు, సహాయ సహకారాలందించిన శ్రేయోభిలాషులకు, కథానికల పోటీలో పాల్గొన్న రచయిత్రులకు, రచయితలకు, న్యాయనిర్ణేతలకు మరియు సభలో పాల్గొన్న అందరికి కృతజ్ఞతలు తెలియజేసారు.

**– ధర్మపురి లక్ష్మణ స్వామి**
సమన్వయకర్త,
భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ – 2025
mob: 99636 16999

చిరునామా : **"ఆనంద నిలయం",** ఇం.నం. 1-5-1020/4, బి.ఆర్.రావు నగర్, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ – 500010. తెలంగాణ.

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET




- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com